శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును

సంపుటము ౭] చెన్నపురి హేవిళంబినామసంవత్సర కార్తికమాసము [సంచిక. ౫

అంతఃపురోపన్యాసము

ప్రాణనాయకా ఈదినము మీరింటికి శీఘ్రముగా వచ్చినారు కారణమేమి? ప్రతిదిన మీప్రకారమే వచ్చుచున్నారా? నాకింకను కండ్లుపోలేదు శీతకాలములో వడవడ వడకుచు నెగళ్లువేసుకొని మీకొర కెన్నిసారులు వేచియుంటిని మీకు జ్ఞాపకములేదు కాబోలు?

అవును మీకట్టివిషయములు జ్ఞాపకముండవు మీబంతులాటలు, మీచందాలు, మీవార్తాపత్రికలు మొదలగు వానితోనే మీకాలమంతయు వ్యర్థపుచ్చుచున్నారు మీకట్టి సంగతులు జ్ఞాపక ముంచుకొనుట కవసరమేమిటి!

మీవ్యవహారమంతయు దెలిసియుండియును ప్రతిదినమును నేనే పొరబాటు పడుచున్నాను మీమామూలు వ్యవహారములకే మీకు తీరికలేనప్పుడు పైపెచ్చు నాటకములు కూడ వచ్చినవి ఈపాడు నాటకములక్రింద ద్రవ్యమంతయు దగ్ధమైపోవుచున్నది నేటిదినము తెల్లవారినది మొదలిదివరకెన్ని చందాలైనవో! నేనీదినము మిమ్ముల నాటకమునకుఁ బోనియ్యను

ఓహో! నేనుగ్రహించలేకపోతిని నాటకమునకుఁ బోదలచియే కాబోలు మీరింత వేగిరముగా దయచేసినారు!

ఈదినము మంచినాటకమనుచున్నారా? అవును వంకాయల సాంబయ్యసెట్టిగారింటికి వచ్చిన చీరలును మంచివియే? అయిననేమి లాభము! మనకెక్కడను పాతు[illegible] పెట్టెలోని పావలాలన్నియును పంచిపెట్టితిరి ఇప్పుడు మీకు పావలాయెక్కడిది? పావలాకాదు రూపాయికావలె ననుచున్నారా? "మింగ మెతుకులేదు మీసములకు సంపంగినూనె" యనినట్లు మీకురూపాయి టిక్కెట్టుకావలెనా? ఒకరూపాయి బియ్యముండినయెడల నాలుగుపూటలు తినవచ్చును నాటకమునకుఁ బారవైచిన లాభమేమి?

కనుల కానందమనుచున్నారా? కడుపులోఁ గాలుచున్నప్పుడు కండ్లకానంద మక్కఱలేదు పురుషులాడవేషములు వేసినప్పుడు చూడకూడదని పెద్దలు చెప్పుదురు ఒకపక్షమునఁ జూడవచ్చునని చెప్పినను వారిమాటమనకుఁ దెలియదుకదా? అక్కడికిఁ బోయిమొద్దువలెఁగూర్చుండి రూపాయతగలపెట్టి రావడ మెందుకు? ఒకరూపాయనిచ్చిన యెడల మనమందరముకూడ చూడవచ్చును మీకొక్కరికే కాని మా కాయానందము కలుగఁ గూడదా? నాటకముల కాడవాండ్రు పోకూడ దనుచున్నారా?

ఎందుచేతనో సెలవియ్యండె భోగంవాండ్రు మొదలగువారక్కడికి వచ్చెదరు వారును మేమును కలసి కూర్చుండవలెనా?

అయితేనేమి? వారొకచోటను మేమొకచోటను కూర్చుండవచ్చును మీ రందు కాప్రకారము నేత్రముల నెఱ్ఱఁజేయుచున్నారు నామాటయే మీకు సరిపడదు

ఓహో నాకప్పుడు తెలిసినది ఈదినము కనకరత్నముకూడ నాటకమునకుఁ బోవును కాబోలు ఈసంగతి నేనిదివరకె యూహించితిని మీరు కుర్చీమీదఁగూర్చుండి దానిప్రక్కను తడకసమీపములోనుండ వచ్చునని కాబోలు అయ్యో! నాకాపురము గూలద్రోయుట కదెక్కడ సంభవించినది? నాథా మీకిట్టిపనులు కూడవు మీస్నేహితు లందరు నాటకమునకుఁ బోయెదరా?

వారికేమి? వారందరు వేలకొలది సంపాదించినారు మనకట్టి యదృష్టము పట్ట లేదు మీరెవరితోను సరిగా మాటలాడరట! మీకు ద్రవ్యమన్న మిక్కిలి యలక్ష్యము నిన్నగాక మొన్న నుద్యోగమునఁ బ్రవేశించిన మీనాక్షిమగడు పదివేలు నిలవచేసినా డట! దానిశరీరమందంతటను బంగారమేకదా నావలె దీపస్తంభమువలె నుండలేదు దానిమగఁడు దమ్మిడియైనను వ్యయముచేయఁడు

వారుకూడ నాటకమునకుఁ బోయెదరనుచున్నారా?

నేను నమ్మను వారాప్రకారము కర్చుపెట్టరు అవును జ్ఞాపకమువచ్చినది వారు కొన్ని కుర్చీలను, నగలను నాటకుల కెరువిచ్చి సొమ్మిప్పకనే నాటకమునకుఁ బోవు చున్నారట! మీకట్టి తెలివిలేదు ఇంటిలోనొక చిల్లిగవ్వయైన నుండగూడదు. పెట్టెలో సొమ్ము వ్యయమగువరకు మీకునిద్రపట్టదు ఆభరణము లెరువిచ్చెదమన్న నాయొద్దనేమి యులేవుకదా? మీప్రయోజకత్వమిట్లు ప్రజ్వరిల్లుచున్నది కుర్చీలన్నియు పాడైపోయి నవి అవి బాగుచేయించుకొనుటకే మనకు దిక్కులేనప్పుడు మనము వాని నెరువిచ్చు టెట్లు! అయ్యో! దీనికంతకును మీరే కారణభూతులు!

మీనాక్షిమగఁడు లుబ్ధాగ్రేసరుఁడనుచున్నారా? మిమ్మున జనులందరేమను కొనుచున్నారో మీరెఱుఁగుదురా! ద్రవ్యములేనివాని బ్రతుకు నరకమనదని వినలేదా?

హీనకులజుఁడైనను నాలుగు డబ్బులు సంపాదించినయెడల జనులందరు వానినేయాశ్ర యింతురు వానినే గౌరవింతురు ,,సర్వేగుణాఃకాంచన మాశ్రయింతి" యని మీర ప్పుడప్పుడు చదువుచుందురే ! మీకుదానియర్థము తెలియదుకాబోలు న్యాయమార్గము నబోవువానియొద్ద ద్రవ్యమెట్లుచేరును మీవేదాంతపు మాటలవలననేమి లాభము !

అన్యాయమున కొడిగట్టగూడదనుచున్నారా? ఆహా ! ఏమి యీనీతులు ! ఇది కలికాల మన్నమాట మఱచితిరికాబోలు ! న్యాయమార్గము నవలంబింపకయుండుట యేయుగధర్మము? మీరులేవ బోవుచున్నారెందుకు? వేళసమీపించుచున్నదా?

మిన్నున నేనుకదలనివ్వను నాటకముచూడవలెనని మూడుదినములనుండి పిల్ల లెంతోముచ్చటపడుచున్నారు ,,ఇంటిగుట్టులంకకుచేటు" నినట్లు మనగృహచ్ఛిద్ర ములు బయిటబడకుండ మర్యాదగా గాపురముచేయుచున్నాను పెట్టెలోని పదిరూపా యిలు వ్యయమైనపిమ్మట మనకు నప్పిచ్చువారెవరు?

మీరువెళ్లకమాన ననుచున్నారా? మీరు నాటకమునకుఁ బోనియెడల నలు గురు నవ్వుదురా? అయ్యో! మనకుదోడీ నాటకములెక్కడ సంప్రాప్తమైనవి? అక్క డకుఁబోయి మీరుచేయునదియేమి? ఆనూనె పొగతగిలినయెడల కండ్లుపోవును మీకిది వరకే కండ్లు కొంచెముజబ్బుగదా! నేత్రములు పోయినవెనుక మీరేమిచేయగలరు? వర్తమానపుస్థితిలో వైద్యులకుడబ్బెక్కడిది? ఈనాటకులు దేశమునందలి ద్రవ్యమునం తయు దోచుకొనుచున్నారు

గానము మొదలగునవి బాగుండుననుచున్నారా? చాలుచాలు! మొన్నరాత్రి వెంకయ్యగారు చూచినారట? అఘోరించినట్లే యున్నదట! ఆయనకు తలనొప్పి వచ్చినదట? అంతకన్న మనగృహమునకు ప్రతిదినము వచ్చు శాస్త్రులుగారు మిక్కిలి శ్రావ్యముగా పాడెదరట! సంగీతము కొరకు మీరక్కడకు బోనక్కఱలేదు

సీనులు బాగుండుననుచున్నారా? ఏమిసీనులు! పాడుసీనులు తెరలోపల నాలుగు టపాకాయలు కాల్చి తుపాకులు చేతిలోనుంచి కొనుట యొక గొప్పసీను కాబోలు? దీపావళినాడట్టి సీను లనేకము చూడవచ్చును

అరణ్యము మొదలగునవి మిక్కిలి యద్భుతముగా బ్రదర్శింప బడుననుచున్నారా?

అంతమాత్రపు వ్యవహారమునకు రూపాయికూడ కావలెనా? మన గ్రామమునకు సమీపమందెన్ని యడవులున్నవి? అక్కడకుఁ బోయి చూడగూడదా? ఈనాటక ములలో విచిత్రవిషయము లేవియునాకు గానరావు మీరు హాయిగా సుఖనిద్రజెందక మీకెందుకీయవస్థ? మీరునామాటలు చెవినిపెట్టరు మీబాగునుకోరువారు నేనుకాక మరెవరు?

మీరాప్రకారము పక్కదిండ్లెందుకు తన్నుచున్నారు?

మీకంత కోపమెందుకు? తాటియాకుల చప్పుళ్లకు కుందేళ్లు బెదరనేరవు నేను నకలకష్టములను పడి రేయింబగళ్లు మీసౌఖ్యముకొరకే పాటుపడుచు మీసమయాసమయములను గుర్తెరిగి సంచరించుచున్నను మీకు నామాటయందింత యలక్ష్యమా? మీరు నిజముగ నాటకమునకు బోవుటలేదు నాటకపు మిషమీద మీరెక్కడకో పోదలచినారు? నేనెరుగుదును మీరు బొంకనక్కరలేదు. నాటకమునకే పోవదలచిన యెడల నేనుకూడ వచ్చుటకు మీరెందు కభ్యంతరము చెప్పుచున్నారు? మీగుట్టు నేను గ్రహించితిని మీరెన్నిప్రమాణముల జేసినను నేను నమ్మను

మీరెందుకాప్రకారము కేకలువేయుచున్నారు? లేదా పద్యమునుచదువుచున్నారా? నేనెట్టిమూర్ఖురాలనైననుమీతో నిన్ని దినములనుండి కాపురము చేయుచున్నప్పుడు నాకింతమాత్రమైనను దెలియక పోవలెనా? మీరుపద్యము చదువుచున్నది లేనిది నేనుగ్రహించగలను పద్యముల జదువుట కిదియే కాబోలు మంచిసమయము నాబ్రతుకు పరిహాసాస్పదమైనదిగా జేయుచున్నారే? మీరంత బిగ్గఱగామాట్లాడుటెందుకు? రేపుప్రొద్దునవాకటిలోనికి నేనెట్లు పోగలను నలుగురు నన్నడిగినయెడల నేనేమి యుత్తరము చెప్పుదును? మీసిగ్గు మీరు చిన్ననాడే విడిచిపెట్టినారు నాది దిక్కుమాలిన యాడజన్మము ఇంటిగుట్టునంతయు మీరు వీధిలోబెట్టుచున్నారు పొరుగువారి పున్నమ్మకు నేనన్నమిక్కిలియసహ్యము దానికీసంగతి తెలిసినయెడల నామర్యాద యంతయు బోవును అగ్నిహోత్ర సాక్షిగా బెండ్లియాడిన భార్యకింత మాత్రపు స్వాతంత్ర్యముండ గూడదా? మగవారేమి చెసినను తప్పులేదు కాబోలు? మీకు నాటకమునందంత యభిలాష కలిగినప్పుడు మీరునాతో జెప్పుటెందుకు? నేను మీక్షేమముకొఱకు జెప్పుచున్నప్పుడు నన్నీప్రకార మల్లరిపెట్టుటెందుకు? నేనిప్పుడు చేసిన తప్పిదమేమిటి? మీరెందుకాప్రకారము గొంతుక బ్రద్దలు చేసికొనుచున్నారు? మీరెట్లు పోయిననుసరే? ఈసంసారపు సంగతి నాకక్కఱలేదు రేపటిదినము నేను మాయమ్మగారింటికి బోయెదను మీస్నేహితురాండ్రతో మీరప్పుడు స్వేచ్ఛగా నుండవచ్చును నేను కంటతడిపెట్టిన యెడల మీయైశ్వర్యమంతయు దొలఁగిపోవును ,,కలకంఠికంఠి కన్నీ । రొలికిన సిరి యింటనుండ నొల్లదుసుమతీ' యని చిన్నప్పుడు చదువుకొనలేదా? మీరు నన్నింత ఘోషపెట్ట గూడదు

ఈపాడు నాటకములు నాకొఱకే సంప్రాప్తమయినవి కాబోలు? ఈనాటకములను దోడు దొమ్మరవేషములు కూడ వచ్చినవట?

దొమ్మరవాండ్రు కారనుచున్నారా? మరియెవరు? బ్రాహ్మణులా? పట్టపరీక్షలు మొదలగువాని నిచ్చినారా?

పట్టపరీక్షల నిచ్చినవారి కీగతియేల? నేనునమ్మను అది కేవలము మాయ ఈ దేశస్థుల బుట్టలో బెట్టుటకు వారీమాయపన్నినారు బి-ఏ పరీక్ష యెక్కడ! దొమ్మరివాడెక్కడ? దొమ్మరియాటకు బి-ఏ పరీక్షకూడ కావలెనా? ఇకముందు పరీక్ష నిచ్చిన వారట్టి వృత్తినే యవలంబింతురు కాబోలు! చాలుచాలు! మీరువాని కొక దమ్మిడియైన నివ్వకూడదు

మీరిదివరకే వాగ్దానము చేసినారా? మీకేమి? మీరెన్ని వాగ్దానములైన జేయుదురు? వాగ్దానము చేసినంతమాత్రమున డబ్బెక్కడనుండి వచ్చును?

ఆబ్రాహ్మణుడు దక్షిణదేశస్థుడట? పశ్చిమదేశమందు చదువుకొనినాడట? కాబట్టి గొప్పవాడులాగే కనుపడుచున్నాడు అనుచున్నారా!

నేనునమ్మను ఇది నిజముకాదు మీరు వానికేమియు నివ్వకూడదు అంత గొప్ప విద్యకలవాడు ముందుగా సొమ్ము వసూలుచేయు టెందుకు? ఈసొమ్ము వసూలైనవెంటనే వాడు తోకఝాడించును! ఈవేషములన్నియు నేనెఱుగుదును! ఈదేశస్థులు మిక్కిలి వెఱ్ఱివాండ్రు. అందువలననే ద్రవ్య సంపాదకులందరీదేశమునకే వచ్చుచున్నారు

కాదు విచిత్రములనేకములు చూపించెదరను చున్నారా?

ఒక రాగిడబ్బుతో నెన్నియో విచిత్రములు చూడవచ్చును. మన గ్రామములోని గారడీపంతులుగారెన్ని చిత్రములు చేయుదురో మీరెరుగుదురా? మీకట్టివి పనికిరావు "కోటివిద్యలును కూటికొరకే" యనినట్లు చదువులన్నియు నుదరపోషణార్థమే

ఆయనమంచి యోగ్యు లనుచున్నారా? మీరెట్లు కనిపెట్టితిరి? వారాంగ్లేయ భాష బాగుగ మాట్లాడగలరా?

ఈకాలములో మాట్లాడలేనివారెవరు! కుసినీవాండ్రు కూడ మాట్లాడగలరు


పంచ నదీతీరమందు మంత్రశాస్త్రము నభ్యసించినా డనుచున్నారా?

ఆహా? ఏమిమాయ! దక్షిణదేశము జన్మభూమియట? పశ్చిమదేశమునందు బరీక్షలనిచ్చినాడట? ఉత్తరదేశమునందు మంత్రములు నేర్చినాడట? ముష్టికొరకీదేశమునకు వచ్చినాడట? ఇదియే గొప్పయింద్రజాలకముగా నున్నదే? ఏమివేషములు? ఈ నాటకమువలన దేశమందలి ద్రవ్యములో సగభాగము పోయినది తక్కినభాగ మీ దొమ్మరివాండ్రు సతిరింతురు కాబోలు?

దేశమంతయు క్షామముచేతను వ్యాధులచేతను పీడింపబడుచున్నది ఈసంవత్సరమొక పుట్టెడుగింజలైన నింటికివచ్చుదారిలేదు ఇట్టి సమయములో నాటకములు, బూటకములకందును ద్రవ్యమంతయును వ్యయపర్చదలచి నారు కాబోలు?

అయ్యో! దైవమా! ఏమిగతి? నాకాపురము గూలద్రోయుట కిదెక్కడ సంప్రాప్తమైనది?

ఈ-నా-ట- అని వెక్కివెక్కి యేడ్చుచు నిద్ర పోయినందున భర్త మెల్లగా లేచి నాటకమునకు బోయి అందేమియు విశేషములు గానరాకందున గారడీవిద్యను చూచి, అది యంతయు మాయగా గ్రహించి మోసపోయినందుకు మిక్కిలి విచారించుచు, భార్య యుపన్యాసమును జ్ఞప్తికి దెచ్చుకొని యిక ముందెట్టి నాటకములకు గాని గారడీలకు గాని పోకూడదని నిశ్చయించుకొని గృహమునకు మఱలివచ్చి శయనమందిరము జేరి మఱునాటి మధ్యాహ్నము వరకు నిద్రజెందెనట? ఆహా! ఏమియీ యంతఃపురోపన్యాసముల మహిమ!



అగ్నిపర్వతములు

భూమియొక్క లోపలిభాగమునుండి కరఁగినరాలు, విషవాయువులు, ద్రావకములు మొదలగువానినిఁ బైకివెడలఁగ్రక్కెడి ద్వారమునకే యింగ్లీషున 'వాల్కెనో' యనిపేరు దీనినే మనవారగ్నిపర్వతమందురు ఇదిమొదట గొట్టమువలెనేయుండి కాలక్రమమునఁ బైకివచ్చు పదార్థములక్కడఁ బోగుపడుటచేఁ బర్వతమగుచున్నది కొన్ని యగ్నిపర్వతములు కొంతకాలమూరకయుండి మృతపర్వతములని పిలువఁబడి, తరువాత జీవపర్వతములగుచున్నవి క్రీ॥ వె॥ 79 వ సం॥ వఱకును 'వెసూవియస' నునది మృతపర్వతముగా నెన్నఁబడుచువచ్చి, యప్పటినుండియు జీవపర్వతమయియున్నది.

అగ్నిపర్వతము లీవేఁడిపదార్థములను గ్రక్కుటకు సిద్ధముగానున్నవని తెలిసికొనుటకు స్థిరమైన యాధారములెవ్వియులేవు సాధారణముగా నీక్రిందిసూచనలు పొడకట్టుచున్నవి

(౧) పర్వతమునం దురుమువంటి ధ్వనులుగలిగి యవి హెచ్చుచుండఁగా భూకంపములు కొంచెము కొంచెము వ్యవధానముగాఁ దఱుచుగాఁగలుగుట

(౨) నూతులయందు జలమింకిపోవుట

(౩) ఊటలు క్రొత్తస్థలములందుఁబుట్టుట

(౪) సముద్రముయొక్క పోటుపాటు లస్వాభావికముగాఁ గలుగుట

అయినను గొన్నిసమయములందివియేవియు లేకయే 1853 వ సం॥ నందు వెసూవియసు పర్వతమువలెనే యకస్మాత్తుగాఁ గలుగవచ్చును

Eruption ద్రవపదార్థములు పైకెగురుట

మొట్టమొదట నిప్పుకొండ భయంకరముగాఁగదలును విస్ఫారము విజృంభించియున్న యావిరియు, గాలియుఁ, గరఁగిన రాతిముద్దలను పైకెగరవేయునంతటి బలము కలిగి, యతివేగముగా వెడలివచ్చును ఇది యధికముగానుండఁగా నావిరిముద్దలు కూడ నాకాశమున కెగిరివచ్చును అప్పుడు గాలిచేత నీయావిరియు దుమ్మునుగలిసి పైని మేఘమువలె క్రిందఁగరఁగుచున్న రాళ్లయెఱుపును బ్రతిఫలించి మండుచున్ననిప్పువలె నగపడును చలనములేకపోవుటయు, నెంతగాలివీచినను స్థలమువిడువకుండుటయు నాయెఱుపు క్రిందిదానిప్రతిఫలనమెగాని మంటగాదని తెలుపుచున్నవి కొంతసేపటి కాయావిరి చల్లారిదుమ్మును వెంబడించుకొని యురుములతోడను మెఱుపులతోడను వర్షమైపడుచున్నది ఇదికొండకాలువలై ప్రవహించి మిక్కిలి యుపద్రవములను గలుగఁజేయును

ఆవిరిముద్దలను వెంబడించుచుదుమ్ము బూడిదరాళ్ళుకూడ నెగురును ఈదుమ్మొకప్పుడు మైళ్లకొలఁది దూరముపఱకునుగూడ నలుప్రక్కలకుఁబోవును

అయిసలండు ద్వీపమునందలి యగ్నిపర్వతపుదుమ్ము సుమారు రెండువేల యేనూఱుమైళ్ల దూరములోనున్న నార్వేయందును స్వీడనునందును గూడ పడెను 472 వ సం॥ న వచ్చిన వెసూవియసు పర్వతమునందలిదుమ్ము సుమారేడువందల మైళ్ల దూరమునున్న కాన్‌స్టాంటినోపిలువఱకును గూడఁ బోయెను

సుమిత్రా జావాద్వీపముల మధ్యనున్న క్రకటద్వీపమునందొక యగ్నిపర్వతము చాల కాలమునుండి మృతపర్వతముగానుండి మెయి 1883 వ సం॥ నుండి జీవపర్వతముగాఁ దొడంగె ఆనెలయందుఁ బర్వతముకదలుటయు నావిరినివిడుచుటయుఁ గానఁబడెను ఇట్లుదానిబలము క్రమముగాఁదీవ్రమై యాగస్టు 26 27 దినములందు హెచ్చుగానుం

డెను సముద్రము గొప్పతరంగములతోఁ గొట్టుకొనుచు సమీపముననున్న ద్వీపములనుముంచఁగా 30,000 జనులుమడిసిరి ఇరువది మైళ్ల దూరముననున్న పడవల కాదినమున దుమ్ముచేత గాఢాంధకారముగానుండెను ఈదుమ్ము 1000 మైళ్లదూరములోనున్న పడవలమీఁద పయితముపడెను వీనియన్నిటికంటె నెక్కువ యుపద్రవముగలిగించునది ద్రవరూపముననున్న కరఁగినరాలు దీనినే యింగ్లీషున "లావా" యందురు 1669 వ సం॥ నందు ఎట్నాయను నిప్పుకొండనుండివచ్చిన "లావా" కొన్నిచోట్ల నయిదుమైళ్ల వెడలుపుగలిగి పదియేనుమైళ్లవఱకుఁ బ్రవహించెను అయిసులండు ద్వీపమునందున్న 'స్కాప్టరుయోకల్' అనునగ్ని పర్వతమునుండి 1783వ సం॥ నందు వచ్చిన 'లావా పండ్రెండుమైళ్ల వెడలుపుగలిగి యేఁబదిమైళ్లవఱకును బ్రవహించెను 1831 వ సం॥ నందు 'గ్రహామ్సు ఐలు అనుద్వీపము, క్రిందనున్న యగ్నిపర్వతబలమున 600 అడుగులు సముద్రముపైకెత్తఁబడెను అగ్నిపర్వతముల కీబలమంతయు విస్తారముగా విజృంభించియున్న యావిరివలననే యనికొందఱును, భూమిక్రమముగాఁ జల్లారుటచేనని మరికొందఱును జెప్పుచున్నారు వీనిశిఖరములు సాధారణముగా రెండుమూడుమైళ్ల వెడల్పునుగూడఁగలిగియుండి పెద్దగొయ్యివలెనుండును

దీనివలనఁ బూర్వులుతలఁచినట్లు నిప్పుకొండ "నిప్పులనుబొగనుద్రోసెడి మండుచున్నకొండ' కాదని స్పష్టముగాఁ దెలియుచున్నది

ఏలయన నిదితొలుదొల్త కొండగాదని యిదివఱకె చెప్పియున్నాము ఆకాశమునందగపడు నెఱుపు, నిప్పుయుకాక క్రిందిదాని ప్రతిబింబమనియు, నలుపు పొగగాక యావిరివలనఁగలిగిన మేఘమనియుఁగూడ వ్రాసియున్నాము అగ్నిపర్వతములు సాధారణముగా సముద్రతీరమునను, ద్వీపములయందును, ఖండముల సరిహద్దులందును, ఉండును ప్రపంచమునందు సుమారు 300 జీవపర్వతములును, 700 మృతపర్వతములును, ఉన్నట్లు లెక్కవేసియున్నారు ఈయగ్నిపర్వతములవలననే భూమధ్యముననుండు ద్రవ్యములు, పైనున్నవానికంటె భిన్నములనియు, అందుముఖ్యముగా ద్రవరూపముననున్న యినుము, నికెలు, కోబాల్టు మొదలగులోహములు నున్నవనియు, నిశ్చయించియున్నారు భూమివలెనే సూర్యునిచుట్టు తిరుగుతోఁకచుక్కలు తమ కక్ష్యలయందు భూమికెక్కువ సమీపముగానున్నపుడు భూమిచే నెక్కువగా నాకర్షింపఁబడి దానిపైఁబడుచున్నవి వీనియందుఁగూడ నికెలు, కోబాల్టు, ఇనుము, ఉన్నట్లు కనుగొనఁబడినది ఇట్లుపడినవానిలోఁగొన్నిటిని మనము చిత్రవస్తు ప్రదర్శన శాలలయందుఁ జూడవచ్చును

సుమం—నీ యభిప్రాయములన్నియు తనమేలుకోరునవియే యని నీ యజమానుఁడెఱుఁగును

కృష్ణ—ఆ సంగతి నేనును ఎఱుఁగుదును నేను, పయి పయికి వినయముఁ జూపుచు ప్రవర్తించు క్రొత్తభృత్యులవంటి వాఁడనుగాను నన్నుచక్కఁగా నాదరింతురా నేనెవరియన్నము తినుచున్నానో యెఱుఁగుదును నన్ను నెత్తిమీఁద మొత్తినా సహింతునుగాని నాయజమానుఁడు నిష్కారణముగా నష్టముపాలగుటను సహింపను

విమల—కృష్ణతాతా! నీ మనసు నొప్పింపవలెనని మా యన్నయ్య యభిప్రాయమెన్నటికిని గాదు

కృష్ణ—ఆలాగయితే సరే అమ్మాయి! కాని, యాతఁడు నాతో నా రీతిని మాటాడుట యేల?

విజ—అందుకు నన్ను క్షమార్పణము చెప్పుమన్నారా?

కృష్ణ—లేదు లేదు ఆ పని నీ కర్హమయినది గాదు

విమ—ఇంక మాచిననాయన విషయమయి మనము చేయవలసినదేమి? అతని కోపోపశమనమునకు సాధనము లేదా?

విజ—ఆ సాధనమును నే నవలంబింపను అతనిని వెళ్లనిమ్ము

సుమం—అతని సొమ్మును మాత్రము దిగవిడిచెనా, వెళ్లినయెడల నాకును విచారము లేదు

కృష్ణ—(పక్కమొగముగా) ఈయన చక్కనిమాట చెప్పినాఁడు

విమ—అన్నయ్యా! వెనుకటికంటె మాఱిన యిప్పటి నీ స్థితిగతులనుబట్టి చూడఁగా, ఈ సమయమందు, ఈ భాగ్యమునుగూడఁ బోఁగొట్టుకొనుట చాలవ్యసనకరముగా నున్నది

విజ—విమలా! మరలఁ బ్రారంభించినావా?

విమ—సరే! సరే! ఇందువిషయమయి యిఁక మాటాడను

విజ—సుమంత్రా! నాతోఁగూడరమ్ము! కృష్ణతాతా! మాచిననాయన రేపే వెళ్లెదనను చున్నాఁడు గనుక, అన్నియు సిద్ధముగానుండునట్లు జాగ్రత్తపెట్టు! ఇంకొకమాట జ్ఞాపకమందుంచుకో! లేశమును అవినయము చూపకు

కృష్ణ—చిత్తముబాబు!

విజయ—
విమల—
సుమం— } నిష్క్రమించుచున్నారు)

కృష్ణ—అవని కల్యాంతవినయము గనఁబఱిచి రేపుసాగనంపెదను అందుచేత నా యజమానునకు మహాలాభముకూడ—ఏమా! అలఁడిక్కడనుండెనా, ఆ ముసలి చండసేనవలబలోఁ దగుల్కొని మోసపడుట తప్ప ప్రయోజనము లేదు ఆ ముసలిది తన కూఁతునిచ్చి పెండ్లిచేసెదనని యీ యవివేకు నుబ్బించుచున్నది గాకుగదా! ఈ మూఁడుగాళ్ల ముసలికి వివాహమా? ఆహాహా! ఆహాహా ఎంతచక్కని మహోత్సవము! ఒకవేళ, ఆలాగే జరిగిన యెడల—

'ఇఱువదియేండ్లకంటె దాఁటని చిన్నవాఁడయిన కుబేరసేనుఁడను పంచమవరునకును, పదేండ్లుదాఁటిన వృద్ధురాలయిన చండసేన కూఁతునకును నిన్నవాడపల్లి దేవాలయములో వివాహ మహోత్సవము జరిగెను' అని వార్తాపత్రికలకు వ్రాయఁబోవుచున్నాను

చండసేన—(ప్రవేశించుచున్నది రసలో,) నా పిల్లను పెండ్లాడుటకు కుబేరసేనుఁ డుద్దేశించి నట్లితనికిఁ దెలిసినట్లున్నది ఏమి యాశ్చర్యము! ఇతఁడు కుబేరసేనునకు నమ్మినబంటులాగున్నాఁడు (పయికి) కృష్ణశర్మా!

కృష్ణ—(ప్రక్కమొగముగా) కృష్ణసర్పమా! (పయికి) ఏ మమ్మా?

చండ—ఈ క్రితము కుబేరసేనుఁడు నీతో యథేచ్ఛముగాఁ బ్రసంగించుచుండెనా?

కృష్ణ—మిక్కిలి యథేచ్ఛముగాఁ బ్రసంగించుచుండెను (ప్రక్కమొగముగా) నన్ను 'అయోగ్యుఁడా' అని తిట్టినాఁడు

చండ—అట్లయిన పక్షమున నా విషయమయిన ప్రస్తావము వచ్చినదా?

కృష్ణ—(ఆశ్చర్యముతో) వచ్చియుండును

చండ—అతనికి కాఁగల వివాహమును గుఱించి మాపిల్లదానిమాట చెప్పినాఁడా? ఇతరు లెవ్వరిపేళ్లయినఁగూడఁ జెప్పినాఁడా?

కృష్ణ—(ప్రక్కమొగముగా) ఈమె విశేషాపేక్షతో నడుగుచున్నది ఈమె రహస్యతంత్రము లెంతవఱకు వెళ్లిన వో కనిపట్టి మా విజయసేనుని గాపాడవలెను (పయికి) ఆయన, పేరెవ్వరిదియుఁ జెప్పలేదు

చండ—(ప్రక్కమొగముగా) మనకార్య సాధనమునకీయు యితనిని మనము లోఁబఱుచుకొనవలసియున్నది (పయికి) కృష్ణశర్మా, నా మనసులోనున్న యావత్సంగతులు నీతోఁజెప్పఁ బోవుచున్నాను

కృష్ణ—(ప్రక్కమొగముగా) ఈమె జన్మములో నెన్నడును ఎఱుఁగని సంగతి యిది! (పయికి) నా పట్ల నీ నమ్మకమునకు చాలసంతోషమయినది

చండ—నీవు నమ్మకముగాఁ బ్రవర్తించి నా కార్య సాఫల్యముపట్ల సాహాయ్యము చేసితివా నీకు గొప్ప బహుమాన మియ్యఁగలను

కుబేరసేనుఁడు—(తిరిగి ప్రవేశించుచున్నాఁడు,) (ప్రక్క మొగముగా) నాహితురాలయిన ఆ చండసేన సంగతి యేమయినదో కనుఁగొనవలెను ఆహా! తిరిగివచ్చినది! ఆ పశువు కృష్ణశాస్త్రితో మాటాడుచున్నది వీరి రహస్యభాషణములను వినవలెను (తెర వెనుక నిలుచున్నాఁడు)

కృష్ణ—సరే! తరువాతి సంగతిఁజెప్పు వినుటకు నే నపేక్షను పట్టఁజాలకున్నాను

చండ—కుబేరసేనుఁడు వివాహమాడ నుద్దేశించుచున్నాఁడని నీ వెఱుఁగుదువు గదా!

కృష్ణ—(ప్రక్క మొగముగా) ఓహో! పయికివెళ్లఁ బుచ్చుచున్నది (పయికి) ఆలాగే కనఁబడుచున్నది

కుబే—(ప్రక్క మొగముగా) ఆ సంగతి యీ దురాత్మున కెట్లు తెలిసినది?

చండ—అతనికి మాపిల్ల నిచ్చుచున్నాను

కృష్ణ—మీ పిల్లనా?

చండ—అవును నిశ్చయముగా

కృష్ణ—(ప్రక్క మొగముగా) ఎంత యసంగతము!

కుబే—(ప్రక్క మొగముగా) ఈమె మృదుమార్దవముల నేమని వర్ణింతును! వీనితోఁ జెప్పుట కొప్పినదిగాని నాతోఁజెప్పలేక పోయినది

చండ—నీ యజమానుఁడును, అరని చెల్లెలును కుబేరసేనని ధనమపేక్షించుచున్నారుగదా!

కృష్ణ—ఆ సంగతి నాకుఁ దెలియదు

చండ—కాని, నాకుఁ దెలియును ఈ వివాహము భంగముచేయుటకు వాండ్రు ప్రయత్నింపఁగలరు

కృష్ణ—కావచ్చును తమ నష్టమును సహింతురా?

చండ—నష్టము కొంతవఱకు మాత్రమే! ఏమా? కుబేరసేనుఁడు నా కల్లుఁడయ్యెనా, అరనిని నేను లోఁబఱుచుకొని సర్వాధికారమును నేనే చెల్లించి, మీయజమానులకు చాల నదుపాయము చేయఁగలను

కృష్ణ—(ప్రక్క మొగముగా) బుద్ధిహీనులు నిన్ను నమ్ముదురుగాక! నేను నమ్మను

చండ—అరని ధనము నా చేతికివచ్చెనా నాయిష్టానుసారము వినియోగింతును

సుజే—(ప్రక్కమొగముగా) ఈ సంగతి మాత్రము నా కిష్టము లేదు

చండ—నిశ్చయముగా నీవు సందేహింపవుగద!

కృష్ణ—నేనేమీ సందేహింపను

చండ—ఈ మాట జ్ఞాపకముంచుకో! నేను నీకు విశేష బహుమానముచేసెదను నీ యజమానునకు, నీకు, నాకుకూడ లాభకరమయిన యీ కార్యముపట్ల వెనుక దీయకు

కృష్ణ—(ప్రక్కమొగముగా) నీ కిపుడు లగినశిక్ష చేసెదను, చూడు (పయికి) సరేకాని, ముందు మనము పొరపాటుపడకుండు నిమిత్తమయి నిన్నుకొన్నిమాట లడుగుచున్నాను మా విజయసేనునికి, చెల్లెలికి, మేలుగోరిన హితురాలనని నీవు చెప్పికొను దానవు

చండ—నిశ్చయముగా మేలుఁగోరిన దాననే!

కృష్ణ—సందేహమేమి? స్వభావసిద్ధముగా వారికిఁ జెందవలసిన వారి పినతండ్రి భాగ్యము వారికి దొరుకకుండఁ జేయుటకు, ఆ వెఱ్ఱి ముసలివాని మనసువిఱిచి, అతని తలలో వివాహాపేక్ష యొకటి యెక్కించినావు

చండ—కృష్ణశర్మా నే నతని మనసు విఱిచినానా?

కృష్ణ—నన్నుపూర్తిగాఁజెప్పనీ! చిన్ననాటనుండియు వారి తండ్రి యిచ్చిన యన్నవస్త్రములచేతను, ఇపుడు వారిచ్చెడు నన్నవస్త్రములచేతను, ఈ శరీరమును పోషించుకొనుచున్న నన్ను, వారి ముఖ్యభృత్యుని, ఆ దొంగసొమ్ములోని కొంతభాగముకొఱకు నీతోఁగలియుమందువా?

చండ—కృష్ణశర్ముఁడా! ఈ మాటలు—

కృష్ణ—చండసేనా! ఈ మాటలు నీ కర్థము తెలియనివిగావు కాని, నీ దుస్తంత్రములుసాగవు

చండ—నా కెట్టిగతిపట్టినది దొంగలతల్లి కేడుప భయమన్నట్లు నే నిపుడు కేకలు వేయుటకయిన వీలులేకున్నది

కృష్ణ—కేకలువేయుటకు నీకు వీలులేదని విచారింపకు కావలసినన్ని కేకలు నేనేవేసి యిల్లంతా అల్లరిచేయుచున్నాను మా విజయసేనుఁడు, విమల, సుమంత్రుఁడు, ఇక్కడకు—

చండ—కృష్ణశర్మా! కృష్ణశర్మా! నాయందు దయచూపు

కృష్ణ—(కుర్చిమీఁదఁ గూర్చుండును) ఇదిగో! ఈ దురంతపు వివాహముసంగతి నేను దేశమందంతటను ప్రకటించెదను—కుబేరసేనునకును—

కుబే—(ప్రక్క మొగముగా) అయ్యయ్యో నన్నిక్కడఁబట్టుకొనునేమో!

కృష్ణ—చండసేన కూఁతునకును—

చండ—కృష్ణశర్మా!

కృష్ణ—అబ్బాయీ! విజయసేనా —

చండ—కృష్ణశర్మా!

కృష్ణ—విమలా!—

చండ—కృష్ణశర్మా!

కృష్ణ—సుమంత్రా—

చండ—కృష్ణశర్మా దయచేసి యొకమాటవిను

కృష్ణ—నేను వినను

చండ—కుబేరసేనునకు మాపిల్లనిచ్చెదు నాలోచనము పూర్తిగామానుకొన్నాను

కృష్ణ—(నెమ్మదిపడి) ఏమి? ఆలాగా అయితేసరి! (కుర్చిమీఁదినుండి లేచుచున్నాఁడు)

చండ—ఆలాగునశాంతించు అల్లరిచేయకు ఆలాగు నెమ్మదిగామాటాడు ఇంటిలోని వారినిఁబిలువకు నన్నేమిచేయమన్నను చేసెదను నీ కిష్టముగానిప్రస్తావము చేసినందుకు చాలవ్యసనపడుచున్నాను నీ యజమానులపట్ల నీకున్న విశ్వాసమునకు నీ యందు నా కత్యంత గౌరవము గలుగుచున్నది వారికి హానికలుగు కృత్యము లేశమునుజేయను కుబేరసేనునకు నా బిడ్డనీయను (ప్రక్క మొగముగా) ఇఁక మన కున్న మార్గమొక్కటే!

కృష్ణ—కాని, నా కా మాటయందు నమ్మక మెట్లు?

చండ—కాటికి కాళ్లు చాఁచుకొనియున్న యీ ముసలిముండకొడుకునకు, సొమ్ముకొఱకుఁగాని యెడల, రత్నమువంటి నా బిడ్డను బలియియ్యనని నీ వెఱుఁగుదువు గదా!

కృష్ణ—అవునవును

కుబే—(ప్రక్క మొగముగా) ఏమి? ఈ మాట నిశ్చయమా?

చండ—అవునుగదా! అందుచేతనే పెండ్లికాకముందే అతని ద్రవ్యము నాయధీనము చేయుటకు నిశ్చయించితిని డబ్బుచేతిలోఁబడనీ ఏదోహేతువుపెట్టి యితనితో కలహించెదను

కృష్ణ—అది ఈ మతిమాలిన వృద్ధునకు తగినశిక్ష కాఁగలదు

కుబే—(ప్రక్క మొగముగా) నా యొడలు నీరయిపోవుచున్నది

చండ—కనుక, ఈ పద్ధతిమీఁద, నా చేతిలో సొమ్ముపడు పఱకును, మీ వారి కేమియుఁ జెప్పకుండుట కంగీకరించినావా? నా చేతఁజిక్కిన సొమ్మంతా నీకేయిచ్చి మరల నీవేమిచ్చినను పుచ్చుకొని సంతుష్టిపొందుదును,

కృష్ణ—నిశ్చయముగా ఆమతిహీనునితో నాకున్న పూర్వవిరోధ మిందువల్లఁ దీరును (ప్రక్కమొగముగా) కాని, నా యజమానునకు నష్టముకలుగకుండు మార్గము ముందుగ యోజింపవలెను చూతము'

చండ—కృష్ణశర్మా! నీ మాట నమ్మనా' నన్ను వెలిపుచ్చవుగద'

కృష్ణ— నా జన్మములో, ఆఁడుదాని నెప్పుడును వెలిపుచ్చియెఱుఁగను.

చండ—కాని, యిపుడది నేర్చుకోకు' (వెళ్లుచున్నది)

కృష్ణ—ఎంతదొడ్డ యిల్లాలవు ఇందుకు సందేహములేదు అతని పినతండ్రికి పిల్లను పెండ్లిచేసి నా యజమానుని వంచించుట కుద్దేశించితివి అది సాగదని తెలిసి యిపుడు పిల్లనియ్యకా ముసలాతనిని మోసపుచ్చఁదలఁచినావు ఈ ప్రపంచమందు దురాత్ములు లేనియెడల, బుద్ధిహీనుల కేహానులును లేవు నేను జూచినవాండ్రలో నీ ముసలాతనివంటి తెలివితక్కువవాఁడు గనఁబడలేదు

కుబే (ప్రక్కమొగముగా) ఇందుకొంతనిజమున్నదనియే నాకనుదోఁచుచున్నది

కృష్ణ—(కుర్చిమీఁదనెక్కి, పయిని వ్రేలాడు కాగితపుటట్టపయి ఛాయాపటము నొకదానినిఁ దీసి, తానుదిగి, కుర్చిమీఁదఁబెట్టి) ఇతని ప్రథమబాల్యావస్థయందుఁ దీయఁబడ్డ ప్రతిమయిది ఇప్పుడితనికి రెండవ బాల్యావస్థ తిరిగివచ్చినది

కుబే—(ప్రక్కమొగముగా) నీ కిపుడు నమస్కారము

కృష్ణ—లేక, యితఁడు త్వరలోనే పరమపదమునకు వెళ్లఁగలఁడు

కుబే—(ప్రక్కమొగముగా) వెళ్లఁడు

కృష్ణ—అపుడితని విషయమయి విచారించు వారెవరు' ఎవరునుగారు' అది యెవరి యపరాధము' తనదే' ఈ రూపమును జూచువారి కితఁడు వృద్ధదశలోనిట్టి కరిసుఁడగునని తోఁచదు ఈ ప్రతిమ తీయఁబడ్డప్పుడితనికి పదునేను సంవత్సరము లుండవచ్చును ఈ జులుపములు, ఈ చక్కని గోటువేసినయంగి, నడుమున వ్రేలాడు తరవారు, ఈ దయారసమొలుకు మొగము, కడుసుందరముగానున్నవి

కుబే—(ప్రక్కమోముగా) ఈ వర్ణనమువిని నాకు వెనుకటి సంగతులన్నియు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి

కృష్ణ—తన తల్లిదండ్రులపట్ల నప్పుడీతఁడు మిక్కిలి యనురక్తుఁడైయుండవలెను నిశ్చయము—

కుబే—(ప్రక్క మోముగా) నిశ్చయముగా—

కృష్ణ—ఇంతేకాక, మా విమలా విజయసేనుల తండ్రియైన తన సోదరునిఁ గూడఁ జాలగారవించియుండవలెను

కుబే—(ప్రక్క మోముగా) నిస్సందేహముగా!

కృష్ణ—అపుడీతఁడు దయాదాక్షిణ్యములు గలిగిన మానవుఁడయియుండవలెను ఇపుడెట్లున్నాఁడు!

కుబే—(ప్రక్క మోముగా) ఇపుడెట్లున్నాఁడు!

కృష్ణ—లేశమును దాక్షిణ్యములేని లోహకఠిన హృదయుఁడు

కుబే—(ప్రక్క మోముగా) కాఁడు కాఁడు

కృష్ణ—గుణములన్నియునశించి లోహమయహృదయముతోఁగూడిన కఠినమయిన శిలావిగ్రహము! కాఁబట్టియే, గతశేషులయిన తన బంధువులను జూచినపుడయిన మెత్తఁబడలేదు

కుబే—(ప్రక్క మోముగా) ఎంతచక్కని బంధువులు! నా భాగ్యమును హరింపఁ గోరిన వారు

కృష్ణ—ఇఁక నా బంధువులన్న నెట్టివారు! ఎంత మంచివారు! మా విజయసేనుఁడు, నేనుగాని, యితరులుగాని తన చిక్కులను వెలిపఱుపకుండ దిట్టముచేసి, తన పినతండ్రినుండి పిన్నకాసయిన నపేక్షింపక, తాను నానావిధములయిన యిబ్బందులఁబడుచు, పినతండ్రిని, అతని పెద్దపులిని, పాములను, పరివారమును, విశేషభక్తి ప్రపత్తులతో భరించుచున్నాఁడు

కుబే—(ప్రక్క మొగముగా) అయ్యో, పాపము! ఈ మాట సత్యమయియుండునా!

కృష్ణ—ఇఁక నా గుణైకనిధి విమలమాట— తన పినతండ్రి యుపచారమందు తానెంత యామోదము పొందుచున్నది! ఇతఁడును తన తండ్రివలెనే ప్రేమింపవలయునని యెన్ని విధాలఁగోరుకొనుచున్నది! అతని కీతనికి నెంత తారతమ్యమున్నది! అందఱు అనునట్లీతఁడు మన్యవ్యాఘ్రమే

కుబే—(ప్రక్క మొగముగా) నన్నందఱు మన్యవ్యాఘ్రమనుచున్నారా!

కృష్ణ—అతని సొమ్మొక్క గవ్వయిన నక్కఱలేదు, ఆ చిన్నదానిపట్ల నిసుమంత కనికరముచూపెనా చాలును

కుబే—(ప్రక్క మొగముగా) ఇఁకనైన నా బిడ్డలు రెండును నావలన లభింపఁ గలవు

కృష్ణ—ఇంతయేల' ఈ ప్రతిమ కొకచట్రముకట్టించి, తన పినతండ్రి హారాత్తు గాఁజూచి సంతోషాశ్చర్య మగ్నుఁడగునట్లు సావిటిలోఁదగిలింతునని నిన్నె నాతోఁ జెప్పినది పాపమాబిడ్డయొద్దనందుకైనను డబ్బులేకున్నది

కుబే—(ప్రక్కమొగముగా) దానికి దీర్ఘాయుస్సు' (కుర్చిమీఁదఁ గూలుచున్నాఁడు)

కృష్ణ—(ప్రతిమతో) నీవు ఈ దేశము విడిచి వెళ్లునపుడు సర్వగుణ భూషితుఁడవయిన బాలుఁడవయియుండి, మరల కరినాత్ముఁడవయిన వృద్ధుఁడవయి వచ్చినావు ఇందుకు ప్రతీకారము నిన్ను నిప్పులలోవేయుటయే' (ప్రతిమఁబుచ్చు కొనుచున్నాఁడు,)

కుబే—కృష్ణశర్మా' ఆ ప్రతిమనుంచుముంచుము

కృష్ణ—ఓహో' కుబేర సేనులవారా?

కుబే—అవును

కృష్ణ—నేనన్నమాటలు విన్నారా?

కుబే—ప్రత్యక్షరమును

కృష్ణ—అయితే నేను జేయఁగలిగినదిలేదు నేనన్నవన్నియు సత్యములు ఇప్పుడుగూడఁ జెప్పుచున్నాను

కుబే—చెప్పవలసినదే నిన్నుఁజూచి నా కత్యంత సంతోషమయినది నాకు నీగాఢాలింగన మిమ్ము

కృష్ణ—కుబేర సేనుఁడుగారు—

కుబే—మాఱుమాటాడక నాకు నీ గాఢాలింగన మిమ్ము నీవు సన్మార్గ ప్రవర్తకుఁడవు విశ్వాసముగల భృత్యుఁడవు జరిగిన చెడుగులనెంత యాలస్యమయినను దిద్దుకొనవచ్చును నాకుచక్కని హితోపదేశముచేసినావు అది నా యావజ్జీవము నన్ను సుఖపెట్టును నా కిపు డుత్సాహము పొంగిపోవుచున్నది ఆడుదునా, పాడుదునా, నవ్వుదునా' ఇందేది ముందుచేయవలయునో యెఱుఁగకున్నాను కాని, కృష్ణశర్మా' మతిమాలిన వృద్ధుఁడని నన్నింకొక మాఱుపిలువుము

కృష్ణ—అయ్యా' అట్లు మీసమక్షమందందునా? మీరిచట లేనపుడందునేమో?

కుబే—ఇప్పుడనకుంటివా, ముందింకనట్లనవలసిన యవసరమేరాదు, చూడు నేనిపుడు పూర్తిగామాఱి క్రొత్తమనుష్యుఁడనయినాను ఇందుకుఁ గారకుఁడవునీవే' అందుచేత నీకు గొప్పబహుమానము దొరుకఁగలదు

కృష్ణ—అయ్యా' నాకు బహుమానాపేక్షలేదు

అన శ్యామసుందరుఁడు తన సుందరముఖమును మందహాసమలంకరింప "ఓయి, పిచ్చివాఁడ, అబద్ధమాడినచోఁ దాఁగునా, భగవంతుని యెదుట మనము దాఁచఁగలమా? అనృతము పైకెన్నఁడయిన పొక్కక పోదు. ఆయోచనఁగట్టిపెట్టి మనమందరము నిజమొప్పుకొందము పైనిదేవుఁడున్నాఁడు" అనిమందలించి యెడతెగని పయనముతో దత్తుమహూనగరమునఁ దనసోదరినైనఁ జూడక యానాటిమధ్యాహ్నము రెండున్నర యామములకు నిందూరునగరముఁ జేరి రాధాకాంతుని యింటికిఁ జనక తనప్రమాదము నెవ్వరితోనుఁ జెప్పుకొనక మృత్యుదేవత కెదురుసన్నాహము సేయువాని తెఱంగున నతిధైర్యముతోఁ గోటకుంజని రాణికిఁదనరాక నెఱుఁగఁ జేసెను రాణియుత్తరువుప్రకారములోనికంజని శ్యామసుందరుఁడు నిలిచినతోడనేయామెయాత్రముతో "గండాభిల్లు నురిదీసినావు కాదా? చచ్చునప్పుడు వాఁడేమన్నాఁడు? భిల్లులకు బుద్ధిఁజెప్పితివా" యని యడిగెను ఆ మాటలకుఁ బ్రత్యుత్తర మంతటి యాత్రముతో నీయక కొయ్యవలె నిలువంబడియున్న దత్తుంజూచి యామె "ఏమిదిపలుకవు వాఁడేమయినాఁడు చెప్ప వేమి?" యని తొలుతటికంటె నెక్కువ యాత్రముతోడను, ఎక్కువ వేగముతోడను దత్తునుబలుకరించెను అంతట వారిట్లు మాటాడిరి

దత్తు—(చేతులుజోడించి) అమ్మా యేమనిచెప్పుదును. గండాభిల్లు పారిపోయినాఁడు

అహల్య—(చెవుల నీ పలుకులుపడునప్పుడామె చమురు చుక్కతగిలిన తప్తలోహమువలె దుర్నిరీక్షయై) నీవింక ప్రాణములతోనుండఁగనే!

దత్తు—నే నీవార్త నేలినవారికి విన్నవించుటకు జీవచ్ఛవమునైయున్నాను

అహ—ఓరిమూర్ఖుఁడా, రాజద్రోహి జస్వంతరావు ప్రముఖులలోఁగూడి రాధాకాంతరావు కష్టపడి పట్టుకొన్నదొంగను లంచములుగ్రహించి వదలిపెట్టి దొంగపారిపోయెనని చెప్పుట కింకనుబ్రతికియున్నావా? ఇంతదూరమురానేల? అచ్చటనెందుకు నీవు పొడుచుకొని చావవైతివి? నీ ప్రాణములు నీకు దక్కనిత్తు ననుకొంటివా యేమి పశువా?

దత్తు—అమ్మా అది నా రాజద్రోహమువలన నైనదిగాదు పొరపాటు

అహ—ఛీ సిగ్గులేక వంకలుచెప్పుకొనెదవేల? పొరపాటా, చేఁజిక్కిన యపరాధినిఁ జేతులారవిడిచితివి పొరపాటెట్లగును! ఛీ నాయెదుటలే నీ మొగమును జూచి నేను భరింపఁజాలను, నీ యాయువు నేటితోమట్టమయినది నా మంచితనము, నాయాదరణము నీకువిషమైనవి ఓరీ, యెవరురా వీనిచేతుల విఱిచికట్టి వీనినిఁబట్టుకొమ్ము రాధాకాంతునిఁ బిలుచుకొనిరమ్ము

ఇట్లు మెత్తని లేడిపిల్లపై నుంకించు నాడుసింగంబువలె రూక్షవచనముల శ్యామసుందరదత్తును నొప్పించి వాని నొకభటుని యధీనముఁ జేసి రాధాకాంతాదుల యాగమనమును నిరీక్షించుచుండెను దత్తుతోఁగూడవచ్చిన మువ్వురి సేవకులలో నొకఁడు రాధాకాంతుని గృహమునకుంజని, జరగిన వృత్తాంతమంతయు వాని కెఱిఁగించెను లత్తును దనకుమారులకంటె నెక్కువప్రేమతోఁ బెంచుకొనుచున్న రాధాకాంతుఁ డీయాకస్మిక దుర్వార్తచే నడుమువిఱిగినట్లు నీరసముగలవాఁడై తాను నాటిన మొక్కనిర్మూలనమగు సమయమువచ్చినదని విచారింపఁదొడఁగెను ఇంతలో రాజసేవకులువానినిఁబిలువవచ్చుటచే నాతండు పయనమై లనగాయపు బాధపూర్ణముగఁ గుటురనందున మెల్లమెల్లగఁ జేతికఱ్ఱసాయముననడచుచు నంతిపురముఁ బ్రవేశించి నరకాసురసంహారణోన్ముఖియగు సత్యభామవలె వెలుపుఁ గొలుపుచూపుగల యహల్యను గని యుచిత నమస్కారములనొనర్చి యెదుటనిలిచెను అంతట నచట నీ క్రింది వ్యవహారము జరిగెను

అహ —ఏమయ్యా నీవు మాకు మేకలమందలోఁ బెద్దపులినిఁదెచ్చిపెట్టినావు సుగుణములకెల్ల నితఁడు నిధియెకాదు రాజభక్తికిఁ బెట్టినదిపేరుకదా యితఁడు! ఆగుణములేమయినవి దొంగను జల్లగాఁబంపినాఁడు

రాధా —అమ్మా! జరిగినసంగతి యేమో తమరు విచారింపవలెను అంతవఱకు నతనియుద్దేశమిదియని చెప్పఁదరముకాదు—

అహ —నీ కింతపక్షపాత మతనియందుండుటచేతనే యింతమునిగినది తేనెపూసినకత్తియగు నీ మూర్ఖునిచే నిష్కారణముగ మేము వంచింపఁబడితిమి జస్వంతరావు మొదలగువారు నన్నుఁజూచి యిపుడునగరా? మిమ్మునమ్మకొని నేనుభయభ్రష్టురాలనైతిని ఇంతటి పాపాత్ముని విడువరాదు ఓయీ శ్యామసుందర, రాజద్రోహమునకు నీకు మరణదండన విధించినాను అంతటఁగాని నా కోపాగ్నిచల్లారదు

రాధా—(విచారముతో) అమ్మా బాలునియందు దయఁజూపుటకు నా ప్రార్థన

అహ —ఏమిదయ! దేశమునుఁదోచుకొను దురాత్ముని విడిచిన దురాత్ముని రాజద్రోహము సల్పినయపకారిని, శత్రువులలోఁజేరిన దుర్నీతిపరుని నేనెట్లు శిక్షచేయఁ వలెను నీ ముసలిమాటల నిఁకఁగట్టిపెట్టుము ఇలని నొక్కనిఁజంపుట నా యభిప్రాయముకాదు ఈ కుట్రలో నింక నెందఱుచేరిరో విచారణఁజేసి వారికందఱకు సంఘుమరణము గల్పించుట కర్తవ్యము కాఁబట్టి విచారణసలుపుమని గోమాజీరావు వద్దకు వీనినంపెదను శ్యామసుందరా, నీ సాక్ష్యమును నీవుఁదెచ్చుకొనుము. ఓరీ భటులార! వీనినిఁ జెఱసాలలోనుంచుఁడు

రాధా—అమ్మా నేనుజామీనుండెద నాకు వీనినప్పగింపుఁడు

అహ—జామీను గీమీనుఁ బనికిరాదు విచారణకావలయును మీరఁదఱు నింకనరుగుఁడు,

అని యామె లేచునప్పటికందఱునుజనిరి శ్యామసుందరుఁడు మరణదండన విని నపుడును మనోధైర్యమువిడువక నిశ్చలుఁడైయుండి రాధాకాంతునివీడ్కొని భటులు గొనిపోవఁ జెఱసాలకుఁజనెను రాధాకాంతుఁడు కన్నీళ్లతో నాతని విడిచి యింటికిఁజనెను

పంద్రెండవ ప్రకరణము.

గండాభిల్లు శత్రువులచేతఁ జిక్కినాఁడనివిన్నది మొదలు విచారణసమయమునఁ దమకుట్రను భిల్లుబయలపెట్టుదురేమోయనియుఁ దమకాప్తుఁడగు గండాభిల్లు నిష్కారణముగనురిదియ్యఁబడుననియు బెంగఁగొని కాలుగాలినపిల్లులవలె దౌలతరావును దుండిరావును జస్వంతరావు గృహముచుట్టును గోమాజీరావు గృహముచుట్టును దిరుగ సాగిరి అందుఁబిఱికివారిలో నగ్రేసరుండగు దుండిరావు తనప్రాణములు బిక్కుబిక్కు మనుచుండుటచే నగరముననుండక దగ్గఱనున్నయొక గ్రామమునకుపాఱిపోయి బందుగుల యింటదాగెను శ్యామసుందరుని స్వాధీనమునుండి భిల్లుఁడు తప్పించుకొనిపోయిన వార్త చెవులకుఁ జల్లగ వినఁబడుట మొదలు తనప్రాణ మిత్రుఁడు తప్పించుకొని నందులకును దమ రహస్యములు బయలుపడు నవస్థలు తప్పినందులకును రాణితలంపులు భగ్నములైనందులకును దౌలతరావు మితములేని యానందమునొంది శ్యామసుందర దత్తునకు రాణిమరణదండన విధించెననియు గోమాజీరావుచేత నతఁడు విచారణఁజేయఁ బడుననియుఁ దెలిసినపుడు కోర్కెల్లసిద్ధించినవనుకొని దుండిరావును బిలిపించెను ఆ పగలంతయు వగలఁబొగలుచు దత్తు చెఱసాలలోనుండి తన యకాలమరణమునకును, శాశ్వతాపకీర్తికిని దనసోదరికిఁ దనపైఁగల యనురాగమునకును సర్వేశ్వరుమాయలకును నక్కజపడఁజొచ్చెను దీపములుపెట్టిన వెనుక రవంత కలఁతనిద్దురపట్టియందుఁదన్నురి స్తంభములపై నెక్కించినట్లును, దానుమృతినొందినట్లును దనసోదరివచ్చి తన శవము పైఁబడి యేడ్చినట్లును దుస్స్వప్నముంగని మేల్కొని నలుదెసలుచూచి మరునాఁడుదయమున జరుగఁబోవునది ముందుగా దృగ్గోచరమయినదని తెలిసికొని మనసులో హా! దైవమా! నిన్న నీ పాటికి గండాభిల్లునకు వాని మరణవార్తను నేను చెప్పుచుంటిని నేఁడు నామరణవార్తను దలఁచుకొనుచుంటిని ఏమి నీ వైచిత్ర్యము! ఈ వృథా విచారములతోఁ గాలయాపనమేల! త్వరగా నాకు స్వర్గలోకసుఖమును గమలాదర్శ

నమును జేయింపుము అని వేడుకొనుచు నొకమారు కన్నీరుఁబెట్టుకొనుచుఁ బరితాపమొందసాగెను శ్యామసుందరునివంటి బుద్ధిశాలియు బాహుశాలియుఁ దమ పక్షమునకు వచ్చునేని తమకక్షనెగ్గునని యాతని నెట్లయినఁదమవైపుఁ ద్రిప్పుకొనుటకు జస్వంతరావు ప్రముఖులు ప్రయత్నములు చేయఁదలఁచి, కారాగృహాధికారి తమకుట్రలోని వాఁడే యగుట జామురాత్రియైన తరువాత జస్వంతరావు రహస్యముగఁ జెఱసాల యొద్ద కరిగి జీవచ్ఛవమువలెఁ బండుకొనియున్న దత్తునుఁజూచి జాలినొంది మెల్లగ వానిలేపెను దత్తులేచి తనయెదుట జస్వంతరావునుజూచి యదికల యేమోయని కలవలపడి నిజమని తరువాత నెఱింగి యతఁడక్కడకు వచ్చుటకు ఆశ్చర్యపడెను. అంతట జస్వంతరావు వానినిఁ బలుకరింప వారిట్లుమాటాడిరి

జస్వం—శ్యామసుందరా, రాజులను రాణులను నమ్మినవారి బ్రతుకులు తుదకెంత వఱకు వచ్చునో నీవు స్వానుభవముచే నిప్పుడెఱిఁగితివా? చలచిత్తులగు ప్రభుపిశాచముల సేవించుటకంటె ముష్టియెత్తుకొని బ్రతుకుటమేలు నిన్నుఁగూర్చి నాకు విచారమగుచున్నది

దత్తు—నా కర్మమునకు రాణియేమిచేయఁగలదు నేనుజేసిన యపరాధమునకు నేను దగినశిక్ష ననుభవించుచున్నాను ఆమెలోపము లేదు

జస్వం—నీపిచ్చి నీ కింకవదలలేదు నేను నిన్నుబ్రతికించు నుపాయమొకటి చెప్పెదను నా మాటవిని ప్రాణములు దక్కించుకొనుము నిన్ను రేపుకొత్వాలగు గోమాజీరావు విచారణచేయునుగదా? గోమాజీ నాకు మిత్రుఁడు నీవురాణిపక్షమును విడిచి మా పక్షమువత్తునని ప్రమాణముచేసి తరువాత మా కక్షలోనుండి రాణితోఁ బోరెదవేని గోమాజీరావుతోఁజెప్పి నిన్ను రక్షింపఁజేసెదను. అట్లు చేసెదవా?

ఈ ప్రశ్నమునకు దత్తుత్తరము సత్వరముగఁ జెప్పలేకపోయెను మహాపాతకహేతువును దుర్దశాప్రాప్తికారణమునైన రాజద్రోహమున కొడిగట్టి యాత్మరక్షణమొనర్చుటుచితిమో, తుచ్ఛప్రాణములపై నాసఁగోసి న్యాయమగు దండననొంది దేహముఁ జాలించుటయుచితమో, వేగమెనిర్ణయింప నేరక తటపటాయించుచుఁ గొండొకసేపటికిట్లు చెప్పెను ,,అయ్యా' నా ప్రాణము రాజభక్తి విషయమున ధారపోసితినని ప్రతిజ్ఞఁగైకొన్నవాఁడను రాజద్రోహముఁజేయుటకు నా ప్రాణమెప్పుడు మరణమెన్నఁడైనను దప్పదుగదా కుట్రవారిలోఁజేరి రాణినిక్షోభపెట్టి ప్రజలనులేపి కొలఁదికాలము సుఖపడుటకంటె గౌరవముతో నీ తుచ్ఛప్రాణమును విడుచుట మంచిది నన్ను బ్రతికించుటయుఁ జంపుటయు ననుగీర్త్యపకీర్తులు రాణికెదక్క

వలెను" అనజస్వంతరావు వానిని మ్రింగివేయునంతటియలుకతోఁ గన్నులెఱ్ఱఁజేసి "దారుణపుచావు చావవలసినయోగము నీకుండఁగ నా మాటలువిని బాగుపడుటకు నీకు మంచిబుద్ధి యెట్లుపుట్టును? నీ కర్మమంతే చావుము" అని చివాలునలేచి చెఱసాలవిడిచి పోయెను నాడట శ్యామసుందరుఁడు కాలిముందరికివచ్చిన యదృష్టదేవతనుద్రోచి వైచితినని కొంచెము పశ్చాత్తాపమునొంది మఱలతానుసలిపినదియె యుత్తమకార్యమనియూరటనొంది యెపుడు తెల్లవారును? ఎపుడీయైహిక దుఃఖముపోయునని సిద్ధముగనుండెను ఆ రాత్రి దౌలతరావు గోమోజీరావును జూడఁబోయి కొన్ని రాజకీయ వ్యవహారముల ముచ్చటించి నడుమదత్తువిషయమై ప్రసంగమురాఁగా వారిట్లు మాటాడిరి

దౌల—జస్వంతరావుమాట మనమునమ్మఁజాలము భిల్లులు దేశముపైఁబడి దోచుకొనుటవలనుగాదఁట రాజపుత్రులుదండెత్తి రావలనుగాదఁట నీతియునుండవలెనఁట కక్షసాధించవలెనఁట అదియుండిన నిదిరాదు అంత నీతిమంతుఁడయ్యె నేని కక్షలోఁ దిగనెగూడదు దిగినవెనుక నన్నిపనులు చేయవలెను

గోమో—అతనిని మొదటినుండియు నేనునమ్మలేదు అయితే దత్తుమాట యీ లాగునవచ్చినదేమి? ఆతనిని విచారణచేయుమని రాణి నాతోఁజెప్పినది

దౌల—నేను పన్నిన పన్నుగడసఫలమైనది కాని నీ దగ్గఱ విచారణకు వచ్చినప్పుడు మనమిదివఱ కనుకొనినట్లు నీవు దత్తునిఁగడ తేర్చవలయునుజుమీ? అతఁడును రాధాకాంతుఁడును వచ్చినఁగాని మనము నెరవేరము వారె కమలను నేను బాధపెట్టుచున్నాననియు నామెను నేను వివాహమాడుదుననియు నా పైనేరములు రాణితోఁజెప్పి లోకములో నా రెండు సంగతులనుచాటి నాకప్రతిష్ఠఘటియించినారు రాణిమీఁదకంటె వారిమీఁద నా కెక్కువకసికలదు అందు శ్యామసుందరునిపై నాకుఁగల కోపమునకు మితములేదు వాని నురిదీయించునట్లు సెలవీయవలెను

గోమో—నే నిందు లేశమైన నన్యాయముఁజేయను నేను పిల్లలఁగలవాఁడను ముక్కునకు సూటిగఁబోయి న్యాయమే చేసెదను

దౌల—మనలో మనకె యిన్ని యభిప్రాయములుండఁగ మనమెట్లునెగ్గఁగలము?

గోమో—అన్యాయముగఁజంపినచో నా మీఁదఁ బ్రజలకుఁగోపముండదా?

దౌల—సరే నీ యిష్టము వచ్చినట్లుచేయుము నే నరుగుచున్నాను

అని దౌలతరావు వినుకుతోఁ దనగృహము విడిచిపోయిన తరువాత గోమోజీరావు దౌలతరావునుజూచి మొదట లోపలదాగియున్న యొకపురుషుని, "భేతాళా యిఁకరావచ్చునురా" యని పిలిచి తన ప్రక్కను గూర్చుండఁబెట్టుకొనెను భేతాళ

సింగు, ఉత్తరహిందూస్థాన నివాసియగు రాజపుత్రుఁడు ఇనుపఖడ్డీలవంటి భుజములును, గుండ్రనితలయుఁ బచ్చనిమొగమునకు నీలికాంతులనొసంగు కోరమీసములును, వాని యాకారము భయంకరముగఁ జేసెను అతఁడు గూర్చుండిన వెనుక వారిట్లు మాటాడిరి

గోమోజీ—సైన్యము లీ పాటికి నింబపురము వచ్చియుండునా?

భేతా—ఇంకను వచ్చియుండవు ఈ నడుమ మారాణావారికి దేహమున నించుక భారముగనున్నది అందుచే నాలస్యమైనది

గోమో—శివనానా తప్పకపారిపోవును అతనిదగ్గఱ విశ్వాసమెగాని బలము లేదు మీరు తుకాజీహోల్కారునకు మాత్రమే జడియవలెను

భేతా—అతఁడు నింబపురము మీఁదికి రాకుండ మీరు జాగ్రత్తపెట్టవలయును నిన్ననో నేడో రాణావారు నింబపురము వచ్చియుందురని తలంచుచున్నాను.

గోమో—నాకు నేఁటిపనియున్నది నీ వింకఁబొమ్ము మఱచిపోక నా సొమ్ము నాకిప్పింపుమా'

అన భేతాళసింగు వీధియరుగుపైనిద్రించు భైరవసింగును వెంటఁబెట్టుకొని తన దారినిఁబోయెను అనంతరము గోమోజీరావు (తనలో) ,,నా కోరిక యెన్నఁడైన నెరవేరె యీ రాజపుత్రులు నింబపురముఁబట్టుకొని యహల్యాభాయినిబాఁదోలి తామే దేశమంతయు నాక్రమించుకొని నాకు మంత్రిపదము నొసఁగుదురా? నే నంతటి యదృష్టవంతుఁడనగుదునా? అనియోచించుచుండఁ దలుపుఁదోసికొని వామనభట్టువచ్చి యెదుటనిలిచెను. ఆలోచనలమాని కొత్వాలువానివైపుఁజూడ వాఁడిట్లనియెను ,,అయ్యా' అతఁడేమియు లంచమిచ్చునట్టి స్థితిలోలేఁడు వానికి బంధువులు లేరఁట

గోమోజీ—ఇచ్చువారులేకేమి మహేశ్వరపురములో నతని బావమఱఁదియున్నాఁడఁట అతఁడు వీనిని వదలించుటకు నెంతధనమైన నాకులంచమిచ్చును దత్తప్రాణ రక్షణమునకు రాధాకాంతరావే లంచమిచ్చును కాని నే నాతని దగ్గఱనుండి లంచము గ్రహింపను అతఁడు నమ్మఁదగినవాఁడు కాఁడు

వామన—నేను సాధ్యమైనంత ప్రయత్నముఁజేసి మీకు రెండువందలైన లంచము తెప్పించెదను మీరు లంచములేని పనిచేయనని ప్రతిజ్ఞఁగైకొన్నారుగదా?

గోమో—ఏ మాత్రమైనను సరే కార్యముచెడకుండఁ దీసికొనిరా, నీ వింకపో నేను నిద్రపోవలయును

అని వామనభట్టునంపి తెల్లవారుదాఁక నిద్దురలేక యిటునటుపొరలుచు నెటో యా రాత్రి నాలుగుజాములుగడపి యుదయమునఁ బెందలకడమేల్కని రాణిదర్శనార్థ

మరిగెను గోమోజీ పరమవిశ్వాసముగల యుద్యోగస్థులలో నొకనిఁగ రాణి పరిగణించుటచే నాతనికీఁదగు నాసనమొసంగి కూర్చుండఁబనిచి గౌరవించి పనియేమని యడిగెను అంతట గోమోజీలేచి, ,,అమ్మా, రాజ్య మల్లకల్లోలముగనుండుటచే నాకు నిద్రపట్టుటలేదు జస్వంతరావు ప్రేరణచే రఘునాధరావు సైన్యమును వెంటఁబెట్టుకొని మనపై వచ్చుచున్నాఁడఁట

అహల్యా—ఏమీ వచ్చుచున్నాఁడా నీ కెవరు చెప్పిరి? నిజమనితోఁచదు

గోమో—అయ్యయ్యో తమరు మాయమర్మమెఱుఁగరు శ్రీపేష్వామాధవరావుగారు పిన్నతండ్రికీఁదగు బలమిచ్చిపంపినారు మీరు తక్షణమె తుకాజీహోల్కారును వారిపై నంపఁదగును

అహల్యా—తుకాజీనిగాదు రాధాకాంతరావు నంపెదను ఈ వేళ నీవు దత్తుపై వచ్చిన యభియోగమును విచారించి న్యాయమైన తీర్పుఁజేయుము

గోమో—రాధాకాంతుఁడు ముసలివాఁడు అతఁడేమియుఁ జేయఁజాలఁడు తుకాజీనిబంపుటయుచితము మీఁద తమచిత్తము

అహ—ఎవ్వరైన నేమి? విశ్వాసముతోఁ బనిచేయనలెనుగాని నీ వింకఁబొమ్ము

అనగోమోజీ తనయేలికయొద్ద నుచితప్రకారముగ సెలవుగైకొని నిష్క్రమించెను రాణిరాధాకాంతునిఁబిలిపించి, తగుసైన్యముతోఁ దక్షణమె పునానగరము నుండి వచ్చుచున్న రఘునాధరావున కెదురుగఁజని వానినోడించిరమ్మని యానతిచ్చెను దత్తునకు మరణదండనతప్పించుటకుఁ బ్రయత్నింపఁదలఁచుచున్న రాధాకాంతరావు పొరుగూరు పోవలసి వచ్చినందులకును దత్తునకు సహాయముచేయకుండ వచ్చినందులకును జింతించి వెళ్లుటకిష్టములేక తప్పక పురివెడలెను

పదుమూఁడవ ప్రకరణము.

రాణి దర్శనముచేసి సంగతులముచ్చటించి గోమోజీరావు చిన్నగాఁదనకచ్చేరికి వచ్చెను కళాహీనమగు మొగముతోడను, దయాహీనమగు హృదయముతోడను, దనమొగమువలె వెలవెలబోవు తెల్లనివస్త్రములతోడను, టక్కుటక్కు మనుముచ్చెల చప్పుడులు వందిమాగధులై తనరాకఁదెలియఁజేయఁ జేతనొక కణుపులుగల పోఁకబెత్తము విలాసార్థముగపట్టుకొని కచ్చేరికిదయచేసిన కొత్వాలునుఁజూచి బంట్రౌతులు దండములుపెట్టిరి అతఁడు కచ్చేరిలో నడుమవేయఁబడిన తనపీఠము నలంకరించినతోడనె నేరములుచేసినవారు క్రమక్రమమున వానియెదుటఁ దీసికొనిపోఁబడిరి తనకు సహాయమునొనర్పఁదగిన రాధాకాంతుఁడు తక్షణమె యూరికిఁజనుటయు, శత్రుగణముతోఁ

జేరి తనపైఁ గక్షవహించిన గోమోజీ తన్నువిచారణచేయుటయు, స్వతహారాణికి తనపై
గోపముదయించుటయు నరసి దత్తు తనకు మరణముతప్పదని ప్రాణరక్షణార్థము ప్రయ
త్నములఁ గూడమానెను ఊరందఱు శ్యామసుందరుని, వానిగుణములను, నెఱిఁగినవా
రగుటచే నతని విచారణఁజూడవలయునని నగరవాసులలోఁ బెక్కండ్రు కచ్చేరికివచ్చి
యెడ తెరపినీయక గణగణధ్వనిఁజేయుచు నెక్కడఁజూచినతామేయైయుండిరి రాధా
కాంతుని భార్యయగు రోహిణీభాయి రాణిదర్శనముచేసి మెల్లగాఁ బ్రసంగవశమున
దత్తుమాటనెత్తి యతని ప్రాణసంరక్షణఁజేయుట యుచితమని రాణితో మనవియొన
ర్చినదయ్యు నామె కసరికొట్టి యిట్టియనావశ్యకవిషయములలో జోక్యముకలుగఁజేసి
కొనవలదని గట్టిగమందలించినందున రోహిణియేగాక యితరులుకూడ నట్టిపరాభ
వమె తమకుజరుగునని భయపడి రాణితోదత్తువిషయమై ప్రసంగించుట మానుకొనిరి
తనమాటవినలేదని జస్వంతరావు దత్తుపైపలుకఁబూని వానిపైసాక్ష్యము గుదుర్చుచుండె
దౌలతరావు సహజముగ నాతని నాశనమునుగోరుచుండ లంచము దనకు నీయలేదని
గోమోజీరా పలుకవహించి తనతొంటికోపము నిప్పుడు దీర్చుకొనఁజూచుచుండెను
దత్తు తనకు లంచమునొసంగినచో గోమోజీరావు ప్రతికక్షలోనివాఁడని కోపముపదని
వానిని వదలియెయుండును గోమోజీకిధనము, నధికారము, ప్రధానముగాని తనకక్ష
నీతి, ధర్మము మొదలగు పట్టింపులులేవు అప్పటికింకను శ్యామసుందరుని బావమఱఁ
యగు మురళీధరదాసును, వీనిసోదరియగు నానందియురారైరి ఇట్టి స్థితిలో స్వపక్ష
పరపక్ష సహాయశూన్యుఁడును, విచారవివర్ణుఁడును, నిరంతరనిర్మల చిత్తుఁడునగు శ్యామ
సుందరదత్తు కొత్వాలుగారి యెదుట నిలునఁబెట్టఁబడఁజూడవచ్చిన జనులెల్లఁ వానిసౌ
మార్యమునుదలఁచియు, గుణములఁదలఁచియుదుఃఖితులైతేరి యాతనిఁ జూడఁజాలరైరి
దత్తుతోనుండిన ముష్వురుసేవకులును, సాక్ష్యము నిమిత్తము కొత్వాలువలన రప్పింపఁబ
యెదుట నిలచిరి ఋషి కుటీరములోనుండి దొంగపలాయనమొందుటచే ఋషిసాక్ష
మావశ్యకమని వానికై క్రిందటిరాత్రియె కొత్వాలు పల్లకినంపినందున నాతఁడును
బయలుదేఱెను కానియప్పటికిఁగచ్చేరికిరాలేదు అట్టహాసమెంతయు విస్తారముగ జ
రిగెనుకాని విచారణ ముహూర్తకాలములో మూఁడుముక్కలతో ముగిసెను అపుడు
విచారణ మారంభముకాఁగ, కొత్వాలుదత్తునుఁగనుఁగొని ‚ నేరమునుజేసితివా'' య
యడిగెను ,, నేను బుద్ధిపూర్వకముగ నేరమునుఁజేయలేదు '' అని దత్తుప్రత్యుత్త
మునుఁజెప్పి నదరుబెదరులేక వరఁదీసిన కత్తివలెనిలువఁబడెను తరువాత సాక్షివిచా
మారంభించి కొత్వాలు ముష్వురసేవకులలో నొకని నీవిషయముఁగూర్చియడుగ వాఁడి
నియెను ,, నే నెఱిఁగినవఱకు నిజము మనవి చేసెదను ఋషికుటీరములో
ఘంట ముండఁగ, దత్తుగారు గండాభిల్లుని దమవెంటఁ దీసికొని యెక్కడికో పోయి

విద్యాధురీణుల యర్హకృత్యములు.

లోకములోని సమస్తపదార్థములకును వృద్ధి నైసర్గిక మయియున్నది ప్రతివస్తువును చిన్నదిగాపుట్టి క్రమ క్రమముగా పెద్దదియగుచున్నది. అయినను సాకారమయిన భౌతిక వస్తువుయొక్క వృద్ధికిని, నిరాకారమయిన యాత్మయొక్క వృద్ధికిని, భేదము కలదు భౌతికపదార్థాభివృద్ధికి పరిమితి యున్నది, ఆత్మాభివృద్ధికి పరిమితిలేదు అందుచేత శరీరము వలెఁగాక యాత్మ శాశ్వతముగా వృద్ధినొందుచుండఁ దగినది. మనుష్యుఁడు శరీరమును మాత్రమేకాక యాత్మనుగూడఁ గలవాఁడగుటచేత నతఁడు నిరంతరాభివృద్ధిని బొందుచుండఁ దగినవాఁడు కాఁబట్టి మనుష్యున కొకకాలమునందు వృద్ధి సంపూర్ణమైనదనియు, అటుపైని వృద్ధినొందవలసిన యావశ్యకములేదనియు, చెప్పుట స్వభావవిరుద్ధము అట్లయ్యును మనదేశములో రెండు తెగలవారిప్పుడు మనపూర్వు లెంతో కాలము క్రిందటనే సర్వజ్ఞులయి పరిపూర్ణదశనుబొందిరనియు, ఆధ్యాత్మిక విషయమున నంతకంటె నధికజ్ఞానము కలుగఁ జాలదనియు, చెప్పుచున్నారు అందొక తెగవారు సామాన్యముగా దివ్యజ్ఞాన సామాజికులు, రెండవతెగవారు పూర్వాచార ప్రియులు. ఈయిరుదెఱఁగులవారి బోధనలవలనను మనదేశమున కింక నభివృద్ధి యసాధ్యమన్న పర్యవసానము తేలుచున్నది దేశాభివృద్ధికి భంగకరమయిన వీరి సిద్ధాంతమును గూర్చి యించుక విమర్శ చేయవలసి యున్నది

వృద్ధియనఁగా నాయావస్తువుయొక్క యుపయోగమునకుఁ దగినట్టుగా సమస్తావయవములును బరస్పరానుకూలముగా పెరుగుట అట్లు సమానముగా పెరుగక యొకభాగము వర్ధిల్లుచు నొకభాగము శుష్కించుచు వచ్చినచో నదినిజమైన వృద్ధిగాక రోగమగును ఒకవృక్షముయొక్క యొకశాఖ నవలెత్తి పెరుగుచు నింకొకశాఖ యాకు లెండి వాడఁబాఱినచో నది యావృక్షముయొక్క రోగ సూచకమయిన యస్వాభావిక స్థితిని దెలుపును అటువలెనే మానవదేహముయొక్కసమస్తావయవములును పరస్పరానుకూలముగా నెదుగక యొకకాలు సన్నగిల్లి యొకకాలు లావయినను, మేను చిక్కి తల బలిసినను, అది సహజమైన వృద్ధిగాక రోగ సూచకమగును భౌతికవస్తు విషయమునందెట్లో యట్లే యాధ్యాత్మిక విషయమునందును మన యాత్మ యన్యోన్యానుకూలముగా సమస్త గుణములలోను సమస్త శక్తులలోను పెంపొందుటయే వృద్ధియగునుగాని యొకదానికి భంగకరముగా నొకటి యతిశయించుట వృద్ధికాదు మనయాత్మకుఁ గలజ్ఞానము, నీతి, కారుణ్యము మొదలైన గుణములలో నీతితొలఁగి తెలివి వికసించినను కారుణ్య

మతిశయించినను సత్యమైన వృద్ధికాదు ఈగుణములన్నియు నొకదాని కొకటి సహకారులుగా వర్ధిల్లక యితరేతర విరుద్ధముగా నొకటి యెక్కువగాను వేఱొకటి తక్కువగాను వృద్ధినొందినచో మనము శుభప్రదమయిన వృద్ధినిబొందిన వారము కానేరము వృక్షాదులగు భౌతికవస్తువుల యభివృద్ధికి వానివాని యుపయోగములనుబట్టి పరిమితి యుండుటయేకాక యేకజాతిలోని యొక కాలపు వానికంటెఁ దరువాతి కాలపు వాని యందాధిక్యమేమియు లేక యుండును వెనుకటికాలపు వృక్షములిచ్చిన రీతి పుష్పఫలాదులనే వాని సంతతి వృక్షములును తరములవరుస నిచ్చుచుండును, వెనుకటికాలపు పక్షులు కట్టిన గూళ్ళవంటి గూళ్ళనే వాని సంతతి పక్షులును తరముల వరుసను గట్టుచుండును అంతేకాని వానియందు క్రొత్త మార్పేదియు నుండదు మనుష్యాత్మకృషి చేయుచువచ్చినకొలఁది నిరంతరాభివృద్ధి నొందుచుండుటయేకాక యొక తరమువారికంటె నొకతరము వారంతకంతకు క్రమక్రమముగా నభివృద్ధి నొందుచుందురు ఆదికాలమునందు దిగంబరులై గుహలలో వసించిన వారిసంతతివారు కొంతకాలమునకు మృగాజినాదులు ధరించి తాము నిర్మించుకొన్న కుటీరములలో వసింతురు, వారి సంతతివారు కాలక్రమమున చీని చీనాంబరధారులయి దివ్యసౌధములలో వాసము చేయుదురు ఇట్లు కాలక్రమమున వృద్ధినొందుచుండుట మనుష్యజాతికి స్వాభావికము, వృద్ధినొందకుండుట యస్వాభావికము భూమిమీఁదఁ గల జంతుజాలములలో నెల్లను మనుష్యుఁడు శ్రేష్ఠుఁడు అతని శ్రేష్ఠతకు ముఖ్యకారణము నిరంతరాభివృద్ధిని బొందుచుండు స్వభావము కలుగుటయే ఈయభివృద్ధి యన్యోన్య సాహాయ్యముచేతఁ గాని కలుగనేరదు. అన్యోన్యసాహాయ్యము నపేక్షింపక యేకాకియైయుండెడు పక్షమున మనుష్యుఁడు బహువిషయములలో మృగములకంటె నధికుఁడు కాఁజాలఁడు కాఁబట్టి మనుష్యాభివృద్ధికిఁ బరార్థపరత్వ మత్యంతావశ్యకము బొత్తిగా పరోపకారచింతలేని కేవలస్వార్థపరుఁడు మనుష్య నామమునకే యర్హుఁడు కాఁడు. మనుష్యునకును మృగాదులకును గల ముఖ్యభేదములలో నిదియొకటి మృగాదులు తమప్రయోజనమును మాత్రమే చూచుకొనునవి, మనుష్యుఁడు స్వప్రయోజనమును మాత్రమేకాక పరులబాగునుగూడఁ జూడవలసినవాఁడు మనుష్యుఁడు స్వలాభమునకంటెఁ బర ప్రయోజనము నెంత యెక్కువగాఁ జూచుకొనుచుండునో యంత యధికుఁడగుచుండును, పరప్రయోజనమునకంటె స్వలాభము నెంతయెక్కువగాఁ జూచుకొనుచుండునో యంత యధముఁ డగుచుండును. ఈ పరార్థ పరత్వము నే దేశోపకారము మొదలైన బహునామములతో వ్యవహరింతురు ఈ పరోపకార శీలతయే మనుష్యున కలంకారము కాఁబట్టి మనుష్యనామమునకర్హులు కాఁగోరెడువారందఱును లోకముయొక్క దుఃఖమును తమ దుఃఖముగాను లోకముయొక్క సుఖమును తమసుఖముగాను భావించుకొని సంఘముయొక్క లోప

ములను తగ్గించుటకును క్షేమమును వృద్ధిపొందించుటకును శక్తి వంచనలేక పాటుపడు చుండవలెను. సంఘము వృద్ధిపొందినఁ దామును వృద్ధినొందుదురు, సంఘము క్షీణదశ నొందినఁ దామును క్షీణదశనొందుదురు. సకలావయవములును నారోగ్య దశయందుండ నప్పుడే యొకయవయవమునకును నెంతమంచి దశలోనున్న దానికని సంపూర్ణసౌఖ్యము కలుగ కుండునట్లే సంఘము మంచిస్థితిలో లేనప్పుడే మనుష్యుఁడును దానెంత విద్యావిత్త సంపన్నుఁడయినను సంపూర్ణసౌఖ్యము ననుభవింపఁజాలఁడు అందుచేత వివేకయుక్తి పురుషునకును సంఘాభివృద్ధికయి సర్వప్రయత్నములను జేయుచుండుట పరమ కర్తవ్యము సంఘవృద్ధికయి కష్టములకోర్చి పనిచేయనివాఁడెంత విద్యాబుద్ధులు గలవాఁడయినను సంఘముయొక్క దుస్స్థితిచేతఁ దానును గొంత దుస్స్థితిని బొందక తీఱదు. సంఘమును దన స్థితికిఁ దెచ్చుటకయి కృషిచేయుచు సంఘముతోడి పాటుగా నభివృద్ధినైనను బొందవలెను, సంఘస్థితికిఁ దానుదిగుచు సంఘముతోడిపాటుగా క్షీణదశనైనను బొందవలెను అంతేగాని సంఘములోనుండి సంఘాభివృద్ధికయి పనిచేయక తటస్థుఁడైయుండి సుఖస్థితినొందుటసాధ్యము కాదు కాఁబట్టి వివేకయుగువాఁడు తోడివారికి లేక తనకు సుఖాభివృద్ధుల కలుగవనియు, మానవుఁడయినందున భ్రాతృతుల్యులగు తోడివారి సుఖాభివృద్ధులకయి తాను జేయవలసిన కార్యములు కలవనియు తెలిసికొని తనధర్మములను పారమార్థిక బుద్ధితో నిర్వహించుచుండ వలయును.

లోకములో తృణము మొదలుకొని పర్వతమువఱకును, చీమమొదలుకొని యేనుఁగువఱకును, గల ప్రతివస్తువును ప్రతిజంతువును నేదో యుపయోగము నిమిత్తము చేయఁబడినదే కాని నిష్ప్రయోజన మయిన దొక్కటియు లేదు పనికిమాలిన గడ్డిపఱకలు సహితము లోకమున నుపయోగపడుచుండఁగా నుత్కృష్టజన్మముగల మనుష్యుఁడు నిరుపయుక్తుఁడుగా సృజింపఁబడఁడనుట స్పష్టము మనుష్యుఁడు లోకములో సృజింపఁబడుటయే యతఁడు లోకోపయోగము నిమిత్తము చేయఁబడె నన్న సత్యమును సహస్రముఖముల ఘోషించుచున్నది లోకములో వస్తువెంత గుణాధిక్యముగలదైననంతయుపయోగాధిక్యము కలదయియుండును మనుష్యుఁడు సమస్తజంతువులకంటె గుణాధికుఁడైనందున లోకమున కన్నిజంతువులకంటె నెక్కువ ప్రయోజనపడవలెను విద్యా విహీనునికంటె విద్యాలంకార భూషితుఁడు గుణాధికుఁ డనుటకు సందేహము లేదుగదా. కాఁబట్టి విద్యాధిక్యముతోడనే కార్యభారాధిక్యమును మనుష్యునిమీఁదఁ బడును. విద్యాధికులవలననే మనదేశము వృద్ధికిరావలెను. తనయభివృద్ధికయి మన దేశము విద్యాధికుల కృషినే యత్యంతము ప్రతీక్షించుచున్నది మాతృభూమి కాశాభంగము కలిగింపక విద్యాసంపన్నులు సార్థకజన్ములగుదురుగాక!

దేశాభివృద్ధికై విద్యార్థికు లాచరింపవలసిన ధర్మములను వివరించుటకుఁ బూర్వము ధర్మాచరణమునకు ప్రతిబంధకములుగా నిప్పటివిద్యావంతులలో వ్యాపించుచున్న ముఖ్యలోపములనుగూర్చి కొంచెము చెప్పవలసియున్నది మనదేశమునం దిప్పు డింగ్లీషు చదువుకొన్నవారిలో క్రియాశూన్యులైన శుష్కవేదాంతులంతకంతకెక్కువగుచున్నారు దేశాభివృద్ధికావలెనన్న పక్షమున నిట్టివారిసంఖ్యతక్కువయి క్రియావంతులసంఖ్యయెక్కువకావలెను ఈశుష్కవేదాంతులు మాటలలోఁ దాముసర్వజ్ఞులగు నీశ్వరులు కాఁబోవుచున్నట్టునటింతురు, చేష్టలలోజ్ఞానహీనులైన పామరులవలెచరింతురు ఇట్టి బుద్ధిమంతులవిద్యావరణముతొలఁగి తామీశ్వరుల మగుదుమన్న భ్రమనువిడిచి, తాముమనుష్యమాత్రులేకాని యీశ్వరు లెన్నటికినిగారనియు, ఈశ్వరునికంటెఁ దామెల్లప్పుడును భిన్నులయియుండెదరనియు, ఈశ్వరుఁడు సేవ్యుఁడును దాము సేవకులుననియు, ప్రభువైనయీశ్వరునికి భృత్యులయిన మనుష్యులగుటచేఁ దామీశ్వర ప్రీతికరముగానిర్వర్తింపవలసిన ధర్మములు గలవనియు, దృఢవిశ్వాసమును బూనవలెను అప్పుడుగాని పురుషుఁడు స్వకృత్యమును ధైర్యముతో నిర్వహింప శక్తుఁడుకాఁడు మనదేశమునందు జీవేశ్వరాభేదవాదము వేలకొలఁది సంవత్సరములనుండి నడచుచున్నను, పుస్తకములందేకాని లోకవృత్తమునందొక్కనికిని నద్వైతసిద్ధియయినట్టు మనమనుభవముచేత నెఱుఁగము ఇఁక ముందగునన్న యాశయు లేదు ఉపదేశములలోను ప్రసంగములలోను మాయతొలఁగినచో మనము బ్రహ్మల మగుదుమని చెప్పుచుండవచ్చును, ఇంటఁగూరుచుండి బ్రహ్మోహమని వేయిసారు లనుకొనుచుండవచ్చును, ఒకానొకప్పుడు మనన సమయమున మనోరథకైవల్యము ననుభవింపవచ్చును. అంతేకాని క్రియవచ్చినప్పు డద్వైతమును నమ్మువాఁడొక్కఁడునుండఁడు ఇతరుఁడు తనయప్పుతీర్పక యపహరించి నప్పుడుగాని తన్ను ప్రహరించినప్పుడుగాని యెంతటి మహావేదాంతియు తన యద్వైతమును మఱచి ద్వైతము నవలంబించి న్యాయస్థానమునకో యారక్షకస్థానమునకో పరుగెత్తకమానఁడు. ఇతరుఁడు తనజోలికి రాక తన కుమారుని జంపినను శోకమునొంది యాహంతనుబట్టి యధికారుల కప్పగింపఁ జూచునుగాని యెంతటి పరమ వేదాంత వేత్తయు

శ్లో॥ యఏవం వేత్తిహంతారం యశ్చైనంమన్యతే హతమ్
ఉభౌతౌనవిజానీతో నాయం హంతి న హన్యతే

,,దేహి చంపువాఁడనియు చంపఁ బడువాఁడనియుఁ దలఁచువా రుభయులును మూఢులు దేహియొకరిని చంపువాఁడును ఒకనిచేఁ జంపఁబడువాఁడునుగాఁడు'' అని శ్రీకృష్ణులవారు గీతలలో నానతిచ్చినారని చూపినను నమ్మియూరకుండఁడు వ్యవహారమునం దెవ్వరికిని సర్వమును బ్రహ్మమన్న నమ్మకము కలుగకపోయినను, ఈసిద్ధాంతవ్యాపనమువలన లోకమునకు నష్టము కలుగకపోదు నేనేదేవుఁడ ననుకొనువారు పాపము

నకు భయపడవలసినపని యుండదు, నేనుజేసిన దానికెల్ల నేనీశ్వరున కుత్తరవాదినను కొనువారుమాత్రమే పాపమున కవశ్యకముగా భయపడవలసి యుండును వేదాంతము యొక్క బోధనమంతయు మనుష్యుఁ డహంభావము ననఁగా నేనన్నజ్ఞానమును నశింపఁ జేసికొని యహంకర్తృత్వమును విడిచి పరమాత్మలోఁ గలిసిపోఁ బ్రయత్నింప వలెనని, మనుష్యుఁ డీశ్వరునికంటె భిన్నుఁడన్న సిద్ధాంతము చేయుబోధనము తన పనులకుఁ దానుకర్తననియు నుత్తరవాదిననియు నమ్మి యహంకర్తృత్వమును విడువక నిరంతరాభివృద్ధినొందుచు ఘనుఁడుకాఁ బ్రయత్నింపవలెనని కాఁబట్టి వేదాంత సిద్ధాంత విశ్వాసమువలన నీతిరతియు పరోపకారచింతయు నాత్మగౌరవమును దేశాభిమానమును దుర్బలములగును, మనుష్యుఁడు తనపనులకుఁ దానుకర్తననియు నీశ్వరుని కుత్తరవాదిననియుఁ దెలుపు సిద్ధాంత విశ్వాసమువలన నీతిరతియు పరోపకారచింతయు నాత్మగౌరవమును దేశాభిమానమును ప్రబలములగును తనపనులకుఁ దానుకర్తనుగా నన్న నమ్మకము కలిగినచో నీతి వర్తనమునకును పరోపకారమునకును ప్రోత్సాహమెట్లు కలుగును? ఒండొరుల నేకముగా బంధించి సౌభ్రాత్రమును పెంచి సుఖసంతోషములను వృద్ధిపొందించిభూమిని స్వర్గతుల్యముగా మార్చునవి నీతిపాశమును ప్రేమపాశమును గాక లోకములో మఱియేవున్నవి? ఈరెండుపాశములును శిథిలములయినయెడల నిజమయిన దేశాభిమానమెక్కడనుండును? దేశాభివృద్ధి యెక్కడనుండును? దేశాభివృద్ధి కలుగుటకయి యహంకర్తృత్వ విశ్వాసమావశ్యకము అహంకర్తృత్వ విశ్వాసమెప్పుడుండునో యప్పుడాత్మాభివృద్ధి ప్రయత్నముండును, ఆత్మాభివృద్ధి ప్రయత్నమున్నప్పు డాత్మగౌరవ ముండును, ఆత్మగౌరవమున్నప్పుడు తనస్వాతంత్ర్యముల నెఱిఁగి పూనికతో వానిని గాపాడుకొనఁ బ్రయత్నించును, తన స్వాతంత్ర్యములను గౌరవించి కాపాడుకొన నేర్చినవాఁడు పరుల స్వాతంత్ర్యముల మన్నించ నెఱుఁగును ఇట్లన్యుల స్వాతంత్ర్యములను మన్నించుటయే ధర్మము, అదియేనీతి, అదియే సోదరభావము అన్యోన్య సోదరభావమే సంఘాభివృద్ధిక మూలము, అన్యోన్య సోదరభావములేక ధర్మరతియుండదు ధర్మరతికలుగుటకు ఫలము పరులు దూషించినను భూషించినను లక్ష్యముచేయక తాను సత్యమనియు న్యాయమనియు నమ్మినదానిని స్థైర్యముతోఁ జేయుట. ఇట్టి ధర్మరతియు స్థిరచిత్తతయు మనలో

చదువుకొన్నవారిలో నిప్పుడు కొఱవడియున్నవి ఈయుత్తమగుణములను మనవారు మనకు ప్రభువులుగానున్న యింగ్లీషువారిని జూచి నేర్చుకోవలసియున్నది మనయిప్పటి చదువరులు మనపరిపాలకుల సుగుణములకంటె దుర్గుణముల నెక్కువగా నేర్చుకొనుచున్నారు సత్కార్యాచరణమునందలి స్థిరచిత్తతను నేర్చుకొన్నవారికంటె మద్యపానమును నేర్చుకొను విద్యావంతు లధికులుగాఁ గానవచ్చుచున్నారు, మూఢాచారము

లనువిడువ నేర్చుకొన్నవారికంటె సీమపాగ మట్టలను బహిరంగముగా కాల్ప నేర్చుకొన్న పండితు లెక్కువగుచున్నారు ఇప్పటి చదువుకొన్నవారిలో వెండ్రుకలను కత్తిరించు కొనుట కుళ్లాయలు ధరించుకొనుట లోనయిన బాహ్యవేషములయందు మార్పులు కావలసినన్ని కనఁబడుచున్నను, వానికిఁ దగినట్టుగా మనుష్యుల కలంకారములయిన సద్గుణ సద్వర్తనములయం దభివృద్ధి యెక్కడనో కాని కానరాకున్నది మనదేశము వృద్ధికి వచ్చుట పురుషభూషణము లయిన సత్కార్యశూరత్వాది గుణసంపదలవలనఁ గాని యవిలేని కేవల బాహ్యవేషధారణమువలనఁ గాదు

మన చదువుకొన్నవారిలోఁ గనఁబడుచున్న యింకొక లోపము సత్యగ్రహణాదరము తగినంత లేకపోవుట ఈసత్యగ్రహణ పరాయణత్వాభావమున కొక కారణము పూర్వాచార పూర్వవ్యవస్థలయం దతిగౌరవముంచుట పూర్వపు సదాచారములను సద్వ్యవస్థలను గైకొనుట మనకు ధర్మమే యయినను యుక్తాయుక్తవిచారములేక పూర్వపు వానినెల్ల నవలంబింపవలయుననుట చదువుకొన్న బుద్ధిమంతుని లక్షణము కాదు ఆలోచనలేక పూర్వపుదానినెల్ల గ్రహింపుచు వచ్చినచో మనకు సత్యగ్రహణాదరము తగ్గిపోవుటయే కాక యభివృద్ధికిని భంగము కలుగును పూర్వకాలము మంచిదని భావించుచుండుట యాలోచనలేని పామరులలో నేకాలమునందును నున్నదే యయినను, ఒకకాలముకంటె నొకకాలమునందుఁ గ్రమక్రమముగా వృద్ధికలుగుచుండుట స్వాభావికమని యెఱిఁగిన వివేకులలో నట్టియభిప్రాయముండుట శ్లాఘ్యము కాదు పూర్వపువారు కష్టపడి జ్ఞానధనము నార్జించిన బుద్ధిమంతులే యయినను వారెంతో శ్రమపడి కూర్చిన జ్ఞానధనమంతయు ననాయాసముగాఁ దరువాతి తరమువారిపాలగుచు వచ్చుటచేతను వారువారు తమయల్పబుద్ధులతోడనే తరములవెంబడిని గొంతకొంత జ్ఞానధనము నప్పుడప్పుడు సమకూర్చి పూర్వపుదానికిఁ జేర్చుచు వచ్చుటచేతను బూర్వపువారికంటెఁ దరువాతివా రధికలోకానుభవశాలులయి దీర్ఘకాయుల భుజములమీఁద నెక్కినవామనులును నెక్కువపొడవైనట్లు జ్ఞానోన్నతులగుట నైసర్గికము అట్లయ్యును జనులలో సర్వసాధారణముగా పూర్వముకాలము మంచిదని యభిప్రాయము కలుగుటకు బొత్తిగా కారణములేకపోలేదు దూరపుకొండలు నునుపన్నసామెత యందఱు నెఱిఁగినదే కదా దగ్గఱఁ బోయి చూచునఱకును లోపములు గానరాక దూరదేశములు స్వదేశమునకంటె నుత్కృష్టములైనవని తోఁచుచుండునట్లే యిప్పటిలోపములు తెలియరాముచే పామరుల దృష్టి కెప్పుడును బూర్వకాలములు మంచివిగాఁ గనఁబడుచుండును పూర్వకాలమునందలి సామాన్యజనుల కష్టములను దెలిసికొనుట కప్పుడాధారము లంతగా లేకపోవుటచేతను, పుస్తకములలో గొప్పవారి గుణమహిమలే సాధారణముగా వర్ణింపఁబడుటచేతను, పామరులు గతకాలమే మంచిదని భావించుట వింతగాదు అయినను పూర్వపు

గ్రంథములనుబట్టి విచారించినచో బహువిషయములు శ్లాఘ్యములైనవి కానవచ్చు నిన్నప్పటికిని గొన్నివిషయములు మనమిప్పుడు చూచిగర్వపడవలసినవిగాలేవు పూర్వకాలమునందండఱును విశుద్ధచరిత్రులుగానుండిరనుమాటకల్ల దేవతలలో సహితము పేరుగల వారిలో వ్యభిచరించనివారిని వ్రేలుమడచి చెప్పుట కష్టము ఇంద్రియనిగ్రహము చేసి నారన్న వనవాసులయిన మహర్షులలో సహితము స్త్రీప్రలోరసించినప్పుడు తనవిశుద్ధచరిత్రమును గాపాడుకొన్నవాఁడెక్కడనో కాని కానఁబడఁడు దేవతలకు గురువైన బృహస్పతియంతటి బుద్ధిమంతునియవస్థ చూడుఁడు ఈకాలమునందును తారలును చంద్రులును పలువురుగలరు కాని కులకాంతను లేవఁదీసికొనివచ్చి బ్రహ్మాదిగివచ్చి వేఁడినను విడువక తగవులాడువారును, దయవలఁని విడిచినతరువాత సంతానముకలిగినప్పుడువచ్చి పుత్రుఁడు తనకురావలెనని భర్తతోతగవు పెట్టెడు జారులును, భార్యనుమగనికని బిడ్డను అంపుమగనికి నిప్పించి తగవుతీర్చెడు న్యాయకర్తలును, ఈపాడు కలికాలమునందుఁ గానరారు బృహస్పతి సహితముతన సహోదరభార్యను కామించిన బుద్ధిమంతుఁడేకాని సామాన్యుఁడు కాఁడు పూర్వకాలమునందలి సంతానక్రమమును జూడుఁడు అప్పటిధర్మశాస్త్రములలో ద్వాదశవిధపుత్రులంగీకరింపఁబడియున్నారు అందొకఁడు మగని యనుమతిమీఁదనో మగఁడుగతించినపిమ్మట బంధువుల యనుమతిమీఁదనో పరపురుషునివలనఁ బుట్టిన క్షేత్రజుఁడు, ఇంకొకఁడు కన్య పెండ్లియాడకముందే స్వసామర్థ్యమువలనఁ గన్న కానీనుఁడు, మఱియొకఁడు పెండ్లినాటికే భార్య గర్భవతియైతరువాతఁ గన్న సహోఢజుఁడు, వేఱొకఁడుమగనియొంటుకలేకయేభార్య స్వశక్తిచేతఁగన్న గూఢోత్పన్నుఁడు ఇట్టి పుత్రులందఱును కలియుదిరిన యీకాలమునఁ బనికిరాకున్నారు ఇప్పటివారి కన్యాయములని తోఁచెడి ధర్మముల ననేకములను మన ధర్మశాస్త్రములనుండి చూపవచ్చును వాని నటుండనిండు పూర్వకాలమునందు కల్లుఁ మొదలయినపానకాద్యములు రక్కువగా నుండెననుటయొఁ గొంత సత్యము లేకపోలేదు ఇతరులను మోసపుచ్చివారి ధనాదుల నపహరించుటకొఱకే కదా తఱచుగా కల్లలాడుదురు ఎల్లవారును దిగంబరులో కౌపీనధారులో యయియుండి యాకలములు భక్షించువారయి యుండినప్పుడు కల్లలాడి పొందులాభమేముండును? కాఁబట్టి సాగ్గించెగా లేనియాకాలమునందు సాత్త్వికముగానున్న కాలమునకంటె దొంగతనములును బొంకులును తక్కువగానే యుండును నాగరికత హెచ్చి సుఖసాధనము లెక్కువయిన కొలఁదిని చౌర్యాదులును మాయోపాయములును మున్నులేనివి కొన్నిక్రొత్త వేర్పడుననుటకు సందేహములేదు. వ్రాఁతయెఱుఁగని కాలములలోనుండని తప్పుపత్రములు వ్రాఁత వచ్చినతరువాత రావా? ఏవో కొన్నికష్టములు రావచ్చు నన్న హేతువుచేత బుద్ధిమంతు లగువారెవ్వారైన సుఖసాధనములను బరిత్యజించి యనాగరికులు కాఁజూతురా? వచ్చెడికష్టము లస్వాభావికము

లయి దుష్టులవలన మాత్రము కలిగెడివగుటచేతను కలిగెడులాభములు స్వాభావికములయి యందఱచే ననుభవింపఁ దగినవగుటచేతను బుద్ధిమంతులగు వారలెల్లప్పుడును సుఖసాధనములను హెచ్చించి దేశాభివృద్ధిని జేయుచు వానివలని నష్టములను సాధ్యమైనంతవఱకు తగ్గించు సదుపాయముల నాలోచించు చుందురు పూర్వకాలపువారి కాశలు తక్కువనియు నిప్పటిమనవారాస్థితిని బొందుట కర్తవ్యమనియు ఘోషించుచుఁ బూర్వకాల మహిమను సహస్రముఖముల భూషించు మన యిప్పటిచదువుకొన్నవారెవ్వరు తమ సుఖస్థితిని విడిచి పూర్వస్థితిని బొందఁ జూతురు? ఎవ్వరు దివ్యభవనములను దివ్యాంబరాభరణములను పంచభక్ష్యపరమాన్నములను వదలి గుహలలోను పర్ణశాలలలోను వసించుచు దిగంబరులును కౌపీనధారులునునయి కందమూల పర్ణభక్షణము చేయుచు జోగులవలె వనవాసముచేయఁజూతురు? దివ్యజ్ఞానులు మొదలైనవారు హేతుకల్పనముచేసి తమ ప్రౌఢిమను జూపి యెంతశ్లాఘించినను పూర్వపుస్థితి మరలవచ్చుట యెప్పటికిని సాధ్యము కాదు పూర్వమన నెప్పటికిఁ బూర్వమో యెప్పటియాచారముల నవలంబింపవలెనో యెట్లు నిర్ణయింపవచ్చును? మనకంటెఁ బూర్వులు రామకృష్ణాది దేవతలను విగ్రహరూపమున మనవలెనే యర్చించుచుండిరి, వారికంటెఁ బూర్వులు యజ్ఞాదికర్మలలో మునిఁగియుండిరి, వారికంటెఁ బూర్వులు రామకృష్ణాది దేవతలనామములైన నెఱుఁగక యగ్నివాయుసూర్యాది భూతముల నారాధించుచుండిరి. మనకంటెఁ బూర్వులు బాల్యవివాహముల నవలంబించి వితంతువివాహములను లేకుండఁ జేసిరి, వారి పూర్వులు బాల్యవివాహములను నెలకొల్పి చచ్చిన భర్తలదేహములతో బ్రతికియున్న భార్యలనుగాల్పఁ బూనిరి, వారిపూర్వులు బాల్యవివాహము లెట్టివో యెఱుఁగక వితంతు వివాహముల నంగీకరించుచుండిరి ఇప్పటివారాదియందెట్టి యాచారముండెనో విచారింపక యిప్పుడేయాచారమున్నదో దానినే పూర్వాచారమని చెప్పి దేవతనువలె సేవించుచున్నారు ఈయనర్థమంతయు నవిచారమూలమున సంభవించుచున్నది ఏదిమంచిదో యేదిచెడ్డదో విచారించి మంచిదాని నవలంబించుచుండెడు పక్షమున దురాచారములు తొలఁగి సదాచారములు ప్రబలును, విచారణలేక యాచరించుచుండెడు పక్షమున సదాచారములు నశించి దురాచారములు ప్రబలి వృద్ధికి భంగము సంభవించును ఏదేశమందును పామరులెప్పుడును విచారించి కార్యములను జేయువారుగాక పూర్వాచారమును బట్టి పదిమంది పోయిన త్రోవను బోవువారుగా నుందురు వారికిఁ బూర్వాచారము పరమదైవతము— అనాగరికదశయందు తొల్లిటివా రవలంబించినపను లన్నియు వారికి పూజనీయములును పవిత్రములును అగును వస్త్రనిర్మాణము చేతకానప్పుడు ధరించిన దిగంబరవేషములును, క్షురకర్మ చేతకానప్పుడు పెంచినగోళ్లును వెండ్రుకలును, కీటకబాధను తప్పించుకొనుటకయి పూసికొనిన బూడిదయు, వారికి గౌరవపాత్రములగును,

SCIENCE PAPER SERIES NO 6

Air—వాయువు

మన చుట్టును ఆవరించియుండువాయువు భూగోళమునందంతటను గొన్నిమైళ్ళ ఎత్తువరకును వ్యాపించియున్నది ఈ పదార్థమదృశ్యమైనదయినను ఇతరవస్తుజాలములవలెనే బరువుగలదైయున్నది అట్టి వాయుస్వభావమునగూర్చి కొంచెము ముచ్చటింతము

ఒక పళ్లెములో నీరుంచి ఆనీటిలో నొక చులకని బెండుముక్కయుంచినచో నది తేలును అపుడా తేలిన ముక్కపై కాకితపు ముక్కలుఉంచి వానికి అగ్నిసంస్కారము చేయవలెను తత్క్షణమే కాకితపు ముక్కలుతగులఁబడుట కారంభించును అట్లు దగులఁబడు సమయమున గాజుపాత్ర నొకదాని నాబెండు ముక్కపైబోరలించి పెట్టవలయును వాయువు సర్వస్థలములయందును వ్యాపించియుండును, గనుక ఆగాజు పాత్రయందుఁగూడ గాలిఉండిఉన్నది గాలిలో నేవస్తువుగాని తగులఁబడు నపుడా పదార్థము వాయువులోనున్న ప్రాణవాయువును గ్రహించుచుండును ఇట్లు జరిగినఁగాని దగులుపడుటయేగలుగనేరదు అందువలన ఈ గాజుపాత్రను తగులపడు కాకితములపై బోరలించియుంచినపుడు, కాకితములు తగులపడుటకు కావలసియుండు ప్రాణవాయువు పాత్రలోనున్న వాయువులోనుండి తీసికొనఁబడుచున్నది ఇందుచే పాత్రలో కొంతవరకు అవకాశము(Vacuum) గలుగుచున్నది పళ్లెములోనున్న నీటిపైనుండు గాలి దానినెప్పుడు నణఁచుచుండును గాజుపాత్రలో అవకాశముగలుగుటచే ఆ ప్రదేశమును పూర్తిచేయుటకు పళ్లెములోని నీటిపైనున్న గాలిప్రవేశింప ప్రయత్నించునుగాని మధ్య నీరుండుటచే పోఁజాలదు అట్లు ప్రయత్నించు సమయమున మధ్యనున్ననీరు గాజుపాత్రలోనికి అవకాశము పూర్తియగువరకును చొచ్చును. ఈ ప్రకారమున గాజుపాత్రలోనికి లేచిననీరు ఇదివరకా పాత్రలో ప్రాణవాయువెంత భాగము నాక్రమించియున్నదో అంతభాగమునే యాక్రమించియుండును సాధారణముగ నీ భాగము పాత్రలో నైదవభాగమైయున్నది ఈ చిన్నయుదాహరణము వలననే మనకుఁ గొన్ని సంగతులు వెల్లడియగుచున్నవి వాయువును ఐదుభాగములుగ భాగించినచోనందులోనొకభాగముప్రాణవాయు (Oxygen) వని మనమూహింపనైయున్నది మిగిలిన నాలుగుభాగములలోను మూడుపంతులకన్న నెక్కువగ సార

జనకము (Nitrogen) ను, అతిస్వల్పముగ నీటియావిరియు బొగ్గుపులుసు వాయువును (Carbonic acid gass) ఉండును

పైనిజెప్పఁబడిన యుదాహరణమును పలువిధములుగ మనము చూపవచ్చును. చిన్నచిన్న కాగితపు ముక్కలు తగులపెట్టుటకు బదులుగ పాస్ఫరసు తునుకను (A bit of Phosphorus) గాని, తగరపుముక్కను (Tin) గాని తుత్తినాగపుముక్కను (Zinc) గాని రగులపెట్టినపుడుకూడ పాత్రలో నైదవభాగమునకే నీరులేచును గనుక పైనుదాహరింపఁబడిన ఫలితార్థములు రెప్పక నిజములుగాని వేరుకానేరవు

ఇఁకనువాయు శక్తినిగూర్చి కొంచెము విచారింతము వాయువు అతిబలము గలదై దగ్గరనున్న పదార్థములను బలమున నణచుచుండును ఇందులకు నిదర్శనముగ నొకసన్నని మూతిగలపొడవైన గాజుపాత్రను దీసికొనవలెను ఆ పాత్రిలోఁబూర్తిగ నీరుంచి దానిమూతిపై సన్నని కాకితము నొకదానినుంచి వదులుగమూయవలెను అపుడాపాత్రను జాగ్రతెగఁదలక్రిందుచేసినచో నందలి నీరు క్రిందికి ప్రవహింపక పాత్రయందే నిలువఁబడియుండును చేసిచూచినచో ఈపనిమిగుల విచిత్రముగను ఆనందకరముగను గన్పించును కాకితమున కడుగుననున్న గాలి తనబలముచే పాత్రిలోనున్న నీటిని స్థలమునుండి భ్రమించకుండు నటుల యణచుచున్నది

వాయువుయొక్క బలమును కనిపెట్టుట కింకొకయుదాహరణము నిందు పొందుపరచుచున్నాము పాదరసమను వస్తువ్రనుసాధారణముగ ననేకులుచూచియేయుందురు సన్నని నాళముగలిగినట్టియు ఒకవైపునమూయఁబడిరెండవవైపున తెరచియున్నట్టియు గాజుగొట్టము నొకదానిని సంపాదించి దానినిండఁబాదరసము నుంచవలయును విరివియైన ముఖముగల వేరొకపాత్రలోఁ బాదరసముంచి అంతసన్నని గాజుగొట్టము ఒకచేతితో జాగ్రతెగపట్టిఉంచి దానిమూతని రెండవచేతి బొటనవ్రేలితో దృఢముగ నణచిపెట్టవలయును అటుపిమ్మట నా గొట్టమును పాత్రలోనున్న పాదరసమందు తలక్రిందుగనుంచి బొటనవ్రేలిని తీసివేయవలెను ఇందువలన గొట్టములోనున్న పాదరసమంతయు పాత్రలో పడదుగాని యతిస్వల్పభాగము మాత్రము పాత్రలోపడి మిగిలినవంతయు గొట్టముననే నిలిచియుండును గొట్టము పొడవు ముప్పదిమూఁడంగుళము లనికొనియెదము ఇట్లైనచో గొట్టములో ముప్పదియంగుళముల ఎత్తువరకు పాదరసమునిలిచియుండును మిగిలిన మూడంగుళముల ప్రదేశమును అవకాశమైయుండును. ఇట్లు సంభవించుటకు కారణము వాయువుయొక్క శక్తిగాని మరియొకటిగానేరదు పాత్రలో పాదరసమున్నదని చెప్పియుంటిమిగదా ... సముపైనున్న గాలి దాని

నెప్పుడు నణచుచుండును ఇట్లణచునట్టి శక్తియే పాత్రలోనున్న గొట్టమున ముప్పది యంగుళముల ఎత్తువరకు పాదరసమును నిలుపుచున్నది ఇదియే గాలియొక్క బలము.

గాలి భూమియంతటఁ గొన్ని మైళ్ల ఎత్తువరకు వ్యాపించియున్నదని ఇదివరలోనే చెప్పియుంటిమిగదా కాని భూమియొక్క ఉపరిభాగము సమముగ నన్నిచోట్లనుండ నేరదు సముద్రపమమైన భూమిపల్లముగను పర్వతప్రదేశములు ఎత్తుగలవిగను ఉండి యున్నవి గనుక సముద్రప్రాంతముననున్న వాయువు ఎక్కుడులోతుగను ఎత్తైన పర్వత ప్రదేశములయందుండునది తక్కువలోతుగను ఉండును అందువలన సము ద్రపుఒడ్డుననున్న గాలియొక్కశక్తి పర్వత ప్రాంతములయందుండు వాయు బలమున కన్న నెక్కుడుగనుండును (ఈ విషయములు గాలినిశ్చయముగ నన్నిచోట్లనుండి నపుడు దానిశక్తభేదములు దెల్పినవియేగాని వీచుచున్నటువంటి వాయువుతో నెంత మాత్రము సంబంధించియుండవు) పైనుదాహరింపఁబడిన పాదరసపు పనిని సముద్ర ప్రాంతమునచేసినచో నక్కడనున్నగాలి గొట్టములో ముప్పదియంగుళముల ఎత్తువర కును పాదరసమును నిలుపును కొన్ని ఎత్తుప్రదేశములకు పోయినకొలఁది గాజుగొట్ట ములో పాదరసము తగ్గుచుండునుఅనఁగా అక్కడనున్నగాలి తక్కువశక్తిని మాత్రమే గలిగియుండును ఇదియే వాయు బలమునునిర్ణయించుట కేర్పర్చఁబడిన యంత్రమున దుండు రహస్యము ఈసాధనమునే ఇంగ్లీషుభాషలో బెరామిటర్ (Barometer) అనివాడుచున్నారు ఈసాధనమువలన ఉన్నతమైన పర్వతపంక్తుల యౌన్నత్యమును సులభముగ కనిపెట్టవచ్చును

పైనిచెప్పఁబడినయుదాహరణములో ఉపయోగింపఁబడినపాదరసమునకు బదులు పాత్రయందును గొట్టమందును నీరుంచి పనిచేసినచో, గొట్టమందంతటను నీరు నిండును ఇంతియగాక నీరుపాదరసముకన్న 13 రెట్లు తేలికయగుటంజేసి, 390 అంగుళములఎత్తువరకునగూడ తగినంత పొడవైనగొట్టమందునీరునిలుపవచ్చును అనఁగా గాలియొక్క బలమును నిర్ణయించు విషయములో పాదరసమును ఉపయోగించక నీటిని ఉపయోగించు సాధనమేర్పరచు కోనైయున్న యెడల ముప్పదిమూడంగుళముల ఎత్తు గలదిగాక 390 అంగుళముల కన్న నెత్తుగల గొట్టమును సంపాదించవలసియుండును ఇది సులభసాధ్యముకాదు ఇదిగాక అట్టిసాధనము వహనయోగ్యముకానేరదు గనుకనే శాస్త్రజ్ఞులు సులభసాధ్యమయిన పాదరస యంత్రము నేయమర్చుచున్నారు

గాలిని ఒకస్థలమునుండి పూర్తిగతీసివేయుట సాధ్యముకాక పోయినను యంత్రసాధనమువలన చాలవరకు తీసివేయఁగలము ఈయంత్ర రహస్యమునుగురించి కొంచెము ఆలోచింపవలసియుండును దీనిని మొట్టమొదట మాగ్డొబర్గు (Magdoburg)

నివాసస్థుఁడయిన ఆటోవాన్ గరికియను నాతఁడు కనిపెట్టియున్నవాఁడు నవీనశాస్త్రజ్ఞులీయంత్రము ననేకవిధముల వృద్ధిపరచియున్నారు కాని యంత్రరహస్య మెక్కడనైన నొక్కటియే ఈయంత్రమును ఇంగ్లీషుభాషలో (Air pump) ఎయిర్ పంపు అని వాడుచున్నారు.

ఈ సాధనమువలన ఆ ఆటోవాన్ గరికియనుశాస్త్రజ్ఞుఁడొకచిత్రమయిన పనిని చేయఁగలిగినవాఁడు. లోహముతో చేసిన రెండర్ధగోళములనుచేర్చిపెట్టిఅందువలన నేర్పడు గోళముననుండి గాలిని యంత్రసాధనముచే తీసివేసెను అపుడాయర్ధ గోళములను వేరుచేయుట బహుకష్టతరముగ గనుపడెను లోపలగాలియుండినపుడు వానిని వేరు చేయుట యతిసులభము ఎందువలననఁగా ఆ గోళమునకు వెలుపలను లోపలను వాయువుండియున్నది గనుక వాయుబలమువలనఁ గలుగుయాటంకమేవియుఁ గలుగనేరదు గాని వెలుపలను గాలిఉండి లోపల గాలిలేకుండుటచే పైనున్నగాలి లోపల ప్రవేశింప యత్నించుచు నా గోళమును దృఢముగ నణచుచుండును గనుక వాయు బలమును జయించిరంగాని యా గోళమును వీడఁదీయఁజాలము ఇట్టి కారణముల వలన మనశరీరములను పైనుండుగాలి కఠినముగ నణచవలసినదే కాని యిట్లు జరుగుచుండుటకానము ఇందులకు కారణమేమన మనకు లోపలకూడ గాలియుండియున్నది గాననట్టి యపాయము మనకు సంభవించుటలేదు వాయువుయొక్క బలమును ఇంకొక చిన్ననిదర్శనముచే స్పష్టపరుపవచ్చును రాగినాణెమునుగాని వెండి నాణెమునుగాని ఒకదానిని సంపాదించి నున్ననైనట్టియు చాకముగనుండునట్టియు గోడపై నణపవలయును అట్లుచేసినచో నది క్రిందికపడక గోడనంటికొనియేయుండును ఎందువల్లననఁగా నాణెమునకును గోడకును మధ్యనుండిన గాలిపూర్తిగ తీసివేయఁబడి నది గనుకనే పైనుండినగాలి యా నాణెమును గోడపై కఠినముగ నణచుచున్నది ఇట్టి కారణములవలననే బల్లులు మొదలయిన జంతువులు గోడలపైఁదలక్రిందుగను గోడనంటియుండుట చూచుచుందుము ఇదియంతయు పైనుండిన వాయువుయొక్క మహత్తేగాని మఱియొకటికాదు గాలియొక్క బలమును చూడవలెనన్న నొకపెద్ద పాత్రను తలక్రిందువేసి నీటిలో ప్రవేశింపఁజేయఁ బ్రయత్నింపవలయును నీరుపాత్ర లోనికి ప్రవేశింపచాలదు ఎక్కువబలమున నణచినను ఇట్లుజరుగదు పాత్రలో నున్న గాలిలేచిపోవుటకు మార్గములేకపోవుటచే నది నీటిని ప్రవేశింపకుండ నాటంక పరచుచుండును కొంచెమెట్లైనఁబాత్రనువంచినచో నందున్నగాలి పైకలేచిపోవును. అందువలన నీరుసులభముగ ప్రవేశించుచున్న

మనలనుజుట్టియుండు మహావాయువుయొక్క గుణములనుగురించి కొంచెము ముచ్చటించితిమి ఈ మహావాయువులో ప్రాణవాయువు ఒకపాలును, సుమారు నాలుగుపాళ్లు నైట్రోజన్ వాయువు, అతిస్వల్పముగ నీటియావిరియు బొగ్గుపులుసు వాయువును ఉండునని ఇదివరలోనె తెలియచేసియుంటిమిగదా. సర్వత్రమహావాయు విట్టి స్వభావముగలదై యున్నదనుట కెంతమాత్రమును సందియములేదు ఒకప్పుడు గెటాసిక్ అను శాస్త్రజ్ఞుఁడు గాలిలోనెగరు బెలూన్ (Baloon)అనుయంత్రసాధనమువలన మహావాయువున 21000 అడుగుల ఎత్తువరకును పోయియున్నవాఁడు అట్టియున్నత స్థలమునఁగూడ వాయుస్వభావము భేదించియుండలేదని నుడివియున్న వాఁడు ఐరోపా, ఆసియా, అమెరికా, ఆఫ్రికామొదలగు వివిధఖండములయందు కూడ వాయు వేకరీతిగ నేయున్నదిగాని మరియొకటికాదు కాని వాయువుయొక్క చిక్కతనము ఎత్తుప్రదేశములకుపోయినకొలఁదితగ్గుచుండును గనుక ఎక్కువ చిక్కగా నుండు గాలినిపీల్చుట కలవాటుపడిన మనము మిక్కిలియున్నత ప్రదేశములయందు నిలువఁజాలము

గాలియదృశ్యమయినను స్వచ్ఛమయిన పదార్థమైయున్నది అనఁగా దానిలోనుండి ఒకపక్కనుండి మరియొకప్రక్కకు వెలుతురుపోఁగలదు అయినను సూర్యుని వద్దనుండియు ఇతర నక్షత్రములవద్దనుండియు బయలు వెడలివచ్చు తేజఃకిరణముల యొక్క కాంతి కొంతవరకు గాలి మధ్యనుండుటవలన తగ్గుచుండును శాస్త్రజ్ఞులు చెప్పుదానిని బట్టిచూడ వెలుతురులోనైదవవంతు కాంతియిట్లు తగ్గుచుండునని తెలియుచున్నది

వాయువు మనలకు ముఖ్యజీవనాధారము. దానిస్వభావము పైనిచెప్పఁబడిన యటులనుండనిచో మనల కనర్థములుచాలపుట్టును మనుజులందరు పిచ్చివాండ్రగుట నిశ్చయము చెట్లుమొదలగునవి పెరుగనేరవు వాయువునందుండు బొగ్గుపులుసుగాలి చెట్లఅభివృద్ధికి ముఖ్యాధారము పగటిసమయమున అనఁగా సూర్యరశ్మిగలిగియుండు నపుడు వృక్షజాతులు గాలియందుండు బొగ్గుపులుసు వాయువునువిభజించి అందుల బొగ్గుసంబంధమయిన ద్రవ్యమును (Carbon) గ్రహించుచు మిగిలిన ప్రాణవాయువును మహావాయువునందు చేర్చుచుండును ఇందులకు వ్యతిరేకముగ జంతువులన్నియు మహావాయువునందుండుప్రాణవాయువునుగ్రహించి బొగ్గుపులుసువాయువును విడుచుచుండును గనుక మహావాయువునందుండు ద్రవ్యప్రమాణము లెంతమాత్రము మార్పును జెందనేరవు ఇట్లు జంతుజాతులను వృక్షజాతులను పరస్పర సహాయకారులఁగఁజేసిన యీశ్వరుని మహిమకొనియాడుటకు మనమెంతటివారము

గాలియదృశ్యమేగాని దానియందుండు నీటియావిరి ఒకప్పుడు దృశ్యమగుట కద్దు గాలికనుపడనివస్తువైయుండి నపుడందులనుండు భాగద్రవ్యమైన నీటియావిరి ఏ కారణమున దృశ్యమగునని మీకు సందియముతోచెడిని ఇందులకొక చిన్న నిదర్శనము చెప్పనైయున్నాము మనము ఊపిరివిడుచుటలోగాలినివిడుచుచున్నాము ఇట్లు విడుచుగాలిలోఁగూడఁగొంత నీటియావిరి ఉన్నయది గాని ఆయావిరిమనలకు సాధారణ సమయముల దృశ్యమగుటకానము శీతకాలమందున మాత్రమాయావిరి దృశ్యమగును. మనచుట్టును వేడిమియుండినపుడు ఆవిరియుపలచనై యదృశ్యమైయుండును మన చుట్టును శీతముండి వేడితగ్గినసమయముల నాయావిరి ఘనీభవించి చిక్కనై పొగవలె కనిపించును ఇందువలననే శీతకాలమున మనము ఉదయమున ఊపిరి విడుచునపుడు నీటియావిరి పొగవలె పైకివచ్చుచుండును గాని ప్రొద్దుఎక్కినకొలఁది ఉష్ణము వృద్ధియగుటచే ఆవిరిఘనీభవింపచాలదు వేసవికాలమునందునుఇట్టి కారణములవలననె నీటియావిరి గన్పింపచాలదు సాధారణముగ పొగబండ్ల ననేకులు చూచియుందురు ధూమయంత్రములనుండి ఒకప్పుడు ఆవిరిని ఎక్కువగానుండినచో వదలుచుందురు ఇట్లువదలునపుడు శీతలముగానున్నయెడ నా యావిరి పొగవలె కనిపించును ఉష్ణముండిన నదికనిపించదు ఎల్లపుడును చెరువులలోనను గుంటలలోనను, సముద్రములలోను, నదులలోనను, ఇంకను ఇతర జలాశయములలోనను, ఉన్న జలము ఆవిరియై పైకిపోవుచుండును ఈ యావిరి పైకిపోయి శీతలప్రదేశముల చొచ్చి ఘనీభవించి మేఘములగుచున్నది ఆ మేఘములే మనలకు వర్షమునిచ్చుచున్నవి. ఈ మహావాయువుననుండు భాగద్రవ్యములన్ని అమితప్రయోజనకారులు వీని నన్నిటిని మనసౌఖ్యము నిమిత్తమేర్పరచిన సర్వేశ్వరునకు మనమెంత కృతజ్ఞులము కావలసియున్నది

Winds and Currents.

ఉష్ణముచే ద్రవ్యములుపలచనై చులకనయగును. వాయువుకూడ వేడిమిచే చులకనపడి చిక్కగనుండుగాలిపైఁ దేలును అయితే సాధారణముగ ప్రపంచమున నుష్ణముగాని చల్లదనముగాని నేకరీతిగ నెల్లచోట్లనుండ నేరదు అందువలన వేడిమిగల స్థలమందున గాలిచులకనై పైకలేచుటయు, చల్లదనముగానుండినచోట గాలిదట్టపడి బరువుగలదై భూభాగమునంటియుండుటయుకూడ తటస్థించును ఇటువంటి స్థలములు దగ్గరనేయుండుట దటస్థించినచో ఒకవైపునగాలి ఊర్ధ్వముగఁజలించుటయు, ఇంకొక ప్రక్కను గాలిక్రిందుగ భూమినంటిపోవుచుండుటయుఁ గలుగవచ్చును ఇట్టి చలనములవలనే వీచునట్టి వాయుభేదము లేర్పడుచున్నవి

వీచునట్టి వాయువుగలుగుటకుండు కారణములిందు అతి సూక్ష్మములయిన యుదాహరణములచే తెలియచేయవచ్చును కొంచెము వేడిమిగలదియొకటియు, శీతముగలిగిన దింకొకటియు, రెండుదగ్గరనే ఉన్నటువంటి గదులున్నవనుకొనియెడమ ఈ రెంటికిని మధ్యనొక ద్వారమేఉండవలెను మనము ఆకస్మికముగ మధ్యనున్న ద్వారమును తెరచినచో వేడిమివలన పలచనై పైకెగసియున్న వేడిగదిలోని గాలి ద్వారమున కుపరిభాగముననుండి చల్లగానుండు గదిలోనికిపోవుచుండును చల్లగానున్నగదిలోని గాలిదట్టముయి బరువుగలదై ద్వారమున కధోభాగమున వేడిమిగల గదిలోనికిపోవుచుండును ఇందులకు నిదర్శనముగ మూడుక్రొవ్వువత్తులు వెలిగించి ద్వారమునకుఉపరిభాగమునను, మధ్యభాగమునను, అధోభాగమునను, ఉంచవలెను పైభాగముననున్న దీపపుజ్వాలచల్లని గదివైపుత్రోయఁబడుచుండును మధ్యభాగమున ఉంచఁబడినది ఎటుప్రక్కకు చలింపక నిశ్చలమైయుండును అధోభాగముననుండు జ్వాల వేడిమిగల గదివైపునకు వంగుచుండును

ఇట్లే మహావాయువునఁగూడ ద్వివిధములైన వాయుప్రవాహములుండును వేడిమిచే గాలికొన్నిస్థలములయందు గగనతలంబునకెగసి అంతరాళమున ప్రవహించుచుండును చల్లనిప్రదేశములయందున్న గాలి భూభాగములనంటి ప్రవహించుచుండును ఇందువలననే భూమికిదగ్గరగ గాలిఒకమార్గమున వీచుచుండఁగా నంతరాళమున మేఘము లాప్రదేశమున వీచుచున్న గాలి ననుసరించి, క్రిందవీచుచున్న గాలికెదురుగ కూడ పోవుచుండును

Trade Winds.

గాలివీచునపుడు దానిగమనిక యనేకకారణములఁబట్టిమారుచుండును మందమారుతము సాధారణముగ గంటకు నాలుగైదుమైళ్లకన్న నెక్కువుగఁ బోఁజాలదు సామాన్యవాయువు గంటకిరువది అయిదుమైళ్లవరకును పోఁగలదు వడిగాలి ఒక గంటలోపలనే ముప్పదిఅయిదుమైళ్లు కూడపోవును, అనఁగా సాధారణపు రైలుబండివడితో పోవుచుండును గంటలోపలనే ఏబది, డెబ్బది, నూరుమైళ్లుదూరమునకుఁగూడపోవు వాయు భేదములుగలవు ఇట్టివాయువులవలన ననేకోపద్రవములు సంభవించుచుండును వీనిని ప్రచండవాయువులని పిలువవచ్చును భూమిక నిరక్షరేఖ వెంబడినినుండు ఉపరిభాగమునన్నెల్ల అంతయధికమైన వాయుచలనములు సంభవించవు గనుకనే ఈమండలమును పూర్వనావికులు శాంతమండలమని (Region of calms) పిలిచిరి నిరక్షరేఖ యనఁగా సూర్యుని సూచించుమార్గము కాని సూర్యుఁడు సంవత్సరమంతయు నేకమార్గముననే ఉండఁజాలఁడు అనఁగా నిరక్షరేఖనే అనుసరించి యుండక ఆరేఖకు కుడియెడమల కొంచెము దూరముగఁగూడ కాన్పించును అందు

వలన నీశాంతమండలము నిలకడగల ప్రదేశమని చెప్పఁజాలము ఈశాంతమండలమున నున్న వాయువు సూర్యుని కెదురుగ నుండుటచే కాలి పలుచనై పైకెగసిగగనపథంబున ఉత్తరదక్షిణములకు పోవుచుండును ఉత్తరముగపోవు ప్రవాహమువలని పూర్వోత్తర గామియైన వాయువును (North-east wind) దక్షిణమునకుపోవు ప్రవాహమువలని పూర్వదక్షిణగామియైన వాయుచలనమును గలుగుచుండును ఈవాయుచలనములు నావికులకమితోపయోగము లగుటంజేసి పూర్వనావికులు వీనిని వర్తకవాయువులని (Trade winds) వాడిరి

ఈ వర్తక వాయువులన్నియుకూడ నిలకడగ నొకమార్గముననే ఎల్లచోట్లపోవునవి కావు ఇవియును దేశకాలస్థితులనుబట్టి పెక్కుమార్పులుచెందుచుండును అందువలనఁ వర్తకవాయువులనివాడుట యసంభావనీయము భూగోళమందంతటనీరుసమముగ నావరించి యుండినంగాని యీవర్తకవాయువులు నిర్ణయముగ ఏర్పరపఁబడిన మార్గములఁ బోఁజాలవు. అట్టి సమయములయందుఁగూడ శీతోష్ణభేధములంబట్టి కొన్నికొన్ని మార్పులు గలుగవచ్చును

The Monsoons.

ఆరు నెలలవరకును ఒకమార్గముననే గాలివీచుచుండుటకలదు అట్టి వానిని ఇంగ్లీషుభాషలో మన్‌సూనులని వాడుచున్నారు వర్తకవాయువులు (Trade winds) దేశస్థితులనుబట్టి మార్పులుచెందుట వలన ఈవాయుభేదము లేర్పడుచున్నవి. ఇందులకు నిదర్శనమేమనగా —ఆసియాఖండమునకు మధ్యభాగమున మిక్కిలి ఎత్తైన మిట్టభూమిగలదు అందువలన ఆస్థలమందు వేడిమిగలిగినట్టియు మిక్కిలి ఉన్నతదశయందున్నట్టియు వాయువుండును గనుకనే సాధారణముగ దక్షిణపూర్వముగపోవు వర్తకవాయువు ఆమిట్టభూమియందుండు గాలిమూలమున దక్షిణపశ్చిమగామియగును అట్లే నిరక్షరేఖ కావలివైపున అనగా దక్షిణధృవభాగమున (on the side of the south pole) ఆస్ట్రేలియాఖండమున్నది ఆఖండమందలి మిట్టభూభాగములయందు ఉష్ణమునొందినగాలియుండును దీనివలన ఉత్తరపూర్వమైన వర్తకవాయువు ఉత్తరపశ్చిమగామియైపోవుచున్నది. కానసంవత్సరమంతయు ద్వివిధమగు వాయుభేదములు (అనఁగా వర్తకవాయువుల మార్పువలనఁ గలుగువాయువులు) వేర్వేరుమార్గముల వివిధదిశలనుండి వీచుచుండును నవంబరు నెలమొదలు మ్యార్చి నెల ఆఖరువరకును నిరక్షరేఖ కుత్తరమున ఉత్తరపూర్వపుగాలియు, దక్షిణమున ఉత్తరపశ్చిమపుగాలియు వీచుచుండును. ఏప్రియల్ నెలమొదలు సెప్టంబరు నెల ముగియువరకు నిరక్షరేఖ కుత్తరమునదక్షిణపశ్చిమపుగాలియు దక్షిణమున దక్షిణపూర్వపుగాలియును వీచుచుండును

పంచతంత్రము.

సుహృల్లాభము.

క శ్రీ రమణీమణి హారవి । హారాంకిత బాహుమధ్య యానతవైరి
క్ష్మారమణ భరణకరుణా । పారంగత తమ్మవిభుని బసవకుమారా ౧

వ అవధరింపు మక్కుమారులు సుహృల్లాభంబనియెడు ద్వితీయతంత్రం బెఱింగింప
మనిన విష్ణుశర్మ యిట్లనియె ౨

గీ సాధనంబులు నర్థసంచయము లేక । బుద్ధిమంతులు తమలోనఁ బొందుచేసి
వలయు కార్యంబు లొనరింపఁ దలఁతు రెందుఁ। గాక కచ్ఛప మృగమూషకములరీతి

వ అది యెట్లంటేని ౪

సీ మహికి నలంకార మండనంబైయొప్పు మహిళాపురప్రాంతి గహనభూమిఁ
బొలుపొందు శాల్మలీభూజంబుపై లఘుపతనుఁడన్ వాయసపతి వసించు
నమ్మహీజముక్రిందికంతట లుబ్ధకుఁ డరుగుదెంచినఁ గాకమాత్రుఁ దలఁచి
దండధరప్రతిముండు వీఁడిచటికి నేమికారణమున నేగుదెంచె
నుండఁ గొలఁగాదు దుర్జనుఁ డున్నచోట। నట్లుగాకయు నాకింటి కరుగవలయు
నిచటఁ బొద్దయ్యె నిలువంగ నేలయనుచుఁ। జూచుచుండంగ నాచెట్టుచుట్టుఁదిరుగ

క వలవైచి క్రిందధాన్యం । బలికి నిగూఢంబుగాఁగ నవ్వలిపొదలోఁ
దలదూఱిచి దృఢదృష్టిం । దొలఁగక కనుఁగొనుచునుండ దూరమునందున్ ౫

క కనుఁగొని చిత్రగ్రీవుం । డనఁబరఁగు కపోతభర్త యాధాన్యములం
దినమనసు పెట్టి తనబల । ముసు దానును వ్రాలి జాలమునఁ దగులుటయున్ ౬

వ ఇట్లు కాలపాశబద్ధుండునుంబోలెఁ జిత్రగ్రీవుండు సపరివారంబుగా నవ్వలఁ
దగులువడినం జూచి ప్రహర్షోత్కర్షంబునం బొదలి లుబ్ధకుండు కదియం జను
నంతకమున్న చిత్రగ్రీవుం డనుచరవర్గంబున కిట్లనియె ౭

సీ ఉదరాగ్నిబాధల నోడలెఱుంగమిఁ జేసి తడఁబడఁ బడితి మిందఱము వలను
మనకు నాపదదీర్ప మతి యెవ్వరున్నారు వెలయ నేఁ జెప్పెదు వెరవువినుఁడు
పురుడించి మన మొక్క పూఁపునవలయెత్తి గగనభాగమునకు నెగసి చనిన
నిప్పు డీయొప్పమిదప్పు నవ్వలఁబోవ పలపాయుటను నొండువలను గలుగు

ననిన నట్లకాక యనుచుఁ గపోతంబు । లద్భుతంబుగాఁగ నాకసమున
కడరి ఎలనుగొనుచు నరిగెఁ గ్రవ్యాదుండు । దుఃఖితుండు విస్మితుండు నగుచు న

వ తనలో నిట్లని విచారించె ౧౦

చ వలఁబడి చిక్కుటొండె వలద్రచ్చుకపోవుటయొండెఁ గాక ప
క్షులు వలగొంచు భారమునకుం దలకొందక యంబరంబునన్
గలఁగక పాఱుటెట్లు వెనుకం గనుఁగొన్నది లేదు చిత్ర మీ
పులుఁగులు నేల వ్రాలఁ గని పోయి హరించెదనంచుఁ జూడఁగన్ ౧౧

వ ఆసమయంబున శాల్మలీవృక్షగతం బగువాయసం బధిక క్షుత్పిపాసాపరవశం బై యుండియు నయ్యాశ్చర్యంబుచూచు వేడుక నాకపోతంబుల వెనుకం బఱచుచుండ లుబ్ధకుండునుం గపోతంబులచెంత భూతలగతుండై యతిత్వరితగమనంబునం బఱచి యవియు దృష్టిగోచరంబులు గాక దూరం బరిగిన నిట్టూర్పు నిగిడించుచు నిజనివాసంబునకుం జనియె నట చని చని చిత్రగ్రీవుం డనుచరవర్గంబున కిట్లనియె. ౧౨

క నా చెలికాఁడు హిరణ్యకుఁ । డీచేరువనుండు నెపుడు నిటఁ దామనపైఁ
దోఁచిన దుర్దశ మాన్పన్ । జూచు నతఁడునన్నుఁ దెలియఁ జూచినమాత్రన్ ౧౩

వ అనఁ గపోతంబు లట్లకాకయని హిరణ్యకుం డనుమూషకంబు బిలంబు గదియ డిగ్గినఁ జిత్రగ్రీవుండు తనవదనంబు బిలద్వారంబునం జొనిపి హిరణ్యకా నేను నీ సఖుండఁ జిత్రగ్రీవుండ న న్నెఱుంగవలయుననినఁ దద్వచనంబు లాకర్ణించి సంభ్రమంబున బిలంబు వెడలి పరిగతుం డగుచెలికాని నత్యాదరంబునఁ గౌఁగిలించుకొని దుఃఖితుండై యిట్లనియె ౧౪

క మిగుల వివేకివి నీకుం । దగ నెగ్గులుచేసెనే విధాత్రుం డనినన్
నగుమను జిత్రగ్రీవుఁడు । తగునే యెఱిఁగియును నడుగఁ దత్త్వజ్ఞనిధీ ౧౫

వ ఎఱింగియు నన్నడిగితివిగాన వినుమని యిట్లనియె ౧౬

ఉ ఎచ్చట నే నిమిత్తమున నేపని యెవ్వనివంక నెప్పుడో
నచ్చట నా నిమిత్తమున నా పని యాతనివంక నప్పుడో
నచ్చుగ మర్త్యకోటికి శుభాశుభనిర్మితకర్మజాలముల్
దెచ్చి విధాత కాలముగతిం గదియించుఁ దలంక నేటికిన్. ౧౭

వ అనినవిని హిరణ్యకుండు విచారింపక పలికితిం గాని నీచెప్పినట్ల యగుం దప్పదని యిట్లనియె ౧౮

గీ నూటపదియోజనంబుల పాటి నెగసి । యవనిఁబత్తులు పొడఁగాంచు నామిషంబు
కాల సంప్రాప్తమైనచోఁ గానలేవు । పాశబంధంబు లేమి చెప్పంగవలయు ౧౯

క గ్రహపీడ చంద్రసూర్యుల । కహిగజ విహగముల కుగ్రమగు బంధనముల్
బహుమతికి దరిద్రత్వము । విహితంబుగఁ జేసినట్టి విధి నేమందున్ ౨౦.

చ. అరుదుగఁ జేరరాని గహనాబ్ధులఁ గ్రుమ్మరు నాఖగాండజో
త్కరములుఁ జిక్కుఁ బెన్వలలఁ గానవు దుర్నయ సచ్చరిత్ర వి
స్ఫురణముఁ దెల్వి స్థానబలమున్ మరి యెయ్యది యెట్లుగ దా క్రియా
పరుఁడవుచున్ గ్రహించు విధి ప్రాణుల దవ్వులఁ గేలు సాఁచుచున్ ౨౧.

చ ఒరులకుఁ గీడు సేయక పరోపకృతిం జరియించు సజ్జనుం
బోరిఁ బోరిఁ బొందు నాపదలు భూరిసుఖంబగు దోషకారికిన్
సరవి యెఱింగి చేయఁడు నిజంబుగఁ జూచి విధాత పూర్వ జ
న్మరచిత పుణ్యపాపములమార్గనిరూఢతఁ గాని నెచ్చెలీ. ౨౨

వ అని యిట్లు హిరణ్యకుండు పలికి తనమిత్రుండగు చిత్రగ్రీవున్ బంధనిర్ముక్తుం
జేయం దలంచి కదిసినం జూచి చిత్రగ్రీవుం డిట్లనియె ౨౩

క. పరిజన బంధచ్ఛేదము । వెరవునఁ గావించి పిదప విడిపింపుననున్
బరివారము నరయని నృప । వరునకు నెక్కడిది రాజ్యవైభవ మెందున్ ౨౪

వ అని యిట్లు పలికిన చిత్రగ్రీవు వచనంబులకుఁ బ్రియంబంది హిరణ్యకుం డిట్లనియె

క నీ నిర్మల గుణసంపద । నీ నడవడి నీకయొప్పు నినుఁ గొనియాడం
గా నాకు శక్యమగునే। భూనుతగుణ నిన్నుఁ బోల్పఁ బురుషుఁడు గలఁడే ౨౫.

గీ వారి భూలోకమంతయు నేలఁజాలు। నధిక పుణ్యుండ వనికొనియాడి యతని
పరిజనంబుల నిర్బంధ భారముడిపి । పిదపఁ దత్స్వామి విడిచి సంప్రీతితోడ ౨౬

గీ విందువెట్టియనుప వేడ్కనాతఁడు పోవ । నాహిరణ్యకుండు నరుగఁ జూచి
లలి నెఱింగి యపుడు లఘుపతనుండను । వాయసంబు గదిసి వానికనియె ౨౭

గీ ఓహిరణ్యక సఖుని నిట్లూఱడించి । బంధ నిర్ముక్తునిఁగఁ జేసి పంపఁ జూచి
సౌఖ్యకరమైన నీతోడి సఖ్యమునకుఁ। గాంక్ష చేసితి నన్నట్లె గారవింపు ౨౮

గీ శాల్మలీవృక్ష గతుఁడనై సంచరింతుఁ । బ్రీతి లఘుపతనుండను పేరివాఁడఁ
గావునెల్లను నాభృత్యగణముగాఁగఁ।బనులుఁ గొందును సామ్రాజ్య పదవినొంది ౩౦

వ అనిన హిరణ్యకుం డతనితోడ నీకును నాకును మైత్రి యెట్లు గూడనేర్చు విను
మని యిట్లనియె ౩౧

గీ ఎవరి కెవ్వరి కేభంగి నెట్లు పొసఁగు । నట్టివారికి మైత్రి దా నమరుఁ గాక
నాశరీరంబు నీకు నన్నంబు నీవు। భోక్తవటు గానఁ జెలిమికిఁ బొందు గాదు ౩౨

వ అనినవిని లఘుపతనం డిట్లనియె ౩౩

క నీదేహము నాకశనము । గా దో పుణ్యాత్మ యిట్టి కష్టుఁడనే యి
మ్మేదినిఁ జిత్రగ్రీవుని । నీదగు సఖ్యంబువోలె నెఱపుము నెమ్మిన్ ౩౪

క రోయకనిను భక్షించిన । నాయాఁకలి దీఱఁ జాలునా యనుమానం
బీయెడ వలదిటు చేకొన । నాయము నన్నుం గపోతనాయకు భంగిన్ ౩౫

క ఎందును దిర్యగ్జంతువు । లందును దగు సమయనిశ్చయంబును హితముం
బొందుపడుట దృష్టంబిది । యిందవయిన నినుఁ గపోతవిభునిం జూడన్ ౩౬

వ అని లఘుపతనుండు మఱియు నిట్లనియె ౩౭

ఉ ఓర్వక దుర్జనుండు కఠినోక్తుల సజ్జనుఁ బల్కెనేని ని
ర్గర్వుఁడు గాని యాతఁడు విచారము నొందఁ డొకింత యేని తా
నౌర్వశిఖిం గలంగని మహాబ్ధిజలంబు తృణాగ్ని వైచినన్
దుర్వహ దుఃఖ భారమయి తోడనె తాపముఁ బొంద నేర్చునే ౩౮.

వ అనిన హిరణ్యకుం డిట్లనియె ౩౯

గీ చపలమతివి నీవు చాల నమ్మినవారి। నెలమిఁ బ్రోచుశక్తి యెట్లు గలుగుఁ
జంచలుండు చెఱుచు సకలకార్యంబులు। గాన నీకు నాకుఁ గాదు పొందు ౪౦

వ అనిన లఘుపతనుం డిట్లనియె ౪౧

ఉ ఏ నటువంటివాఁడనని యీవిరసోక్తులు పల్కనేటికిన్
మానుము లోనిశంక బహుమాన పురస్సరమైన మిత్రసం
ధాన మవశ్యకార్యముగఁ దత్పరతం దగఁ జేయు నాయెడం
గానిగుణంబు లెన్నకు మొకానొకవేళను నో హిరణ్యకా ౪౨

వ అనిన నతం డిట్లనియె ౪౩

గీ నీకు నాకును శాత్రవనియత ధర్మ । మైననడవడి వర్తిల్లు నాత్మయందుఁ
గల్మషము లేని మైత్రి దాఁ గలుగు టెట్లు। గానఁ జెప్పంగ నదియు యుక్తంబు గాదు

గీ బుద్ధిమంతుఁడైన పురుషుండు దనశత్రు। హితుఁడటంచుఁ జేరనిచ్చి చెడును
దప్తజలముచేతఁ దడిసిన యగ్ని దా। హీనమగుచు శమితమైన కరణి ౪౫.

వ అని మఱియును ౪౬.

క. విను శక్యమైన కార్యము। చనుఁ జేయ నశక్యమైనఁ జను నే చేయన్
వననిధిపై శకటంబును । నొనరంగా మిట్ట నేల నోడయుఁ జను నే. ౪౭.

చ మిగుల హితుండు నావలన మేలునుఁ బొందె నితండు నాయెడం
దెగఁడని ధూర్తు నమ్మి చెడుఁ డెల్లమి సజ్జన శబ్దమాత్రమే
సెగడునుగావి యిప్పుడవనిన్ సుజనుండను వానిఁ గాన ని
మ్మగ ధనలేశమాత్రమున మోహనిబద్ధము లోకమంతయున్ ౪౮

ఉ చాలఁగ నిష్ఠుఁడంచు నతిశౌర్య మహోద్యమ కార్యజాలముల్
మేలుగఁ జేయునంచును సమీపము పాయక యుండునట్టి దు
ష్శీలుని వర్తనం బెఱిఁగి చేరఁగ నిచ్చినఁ జేటువచ్చు మ
ర్త్యాలికి నంకమధ్య భుజగాంకిత సుప్తుని బోల్ప బిట్టుగన్. ౪౯

క సనిదానంబున శత్రుఁడు । ననుకూలత లేనినిజకులాంగనమనువున్
వినయంబులేని మనుజుల । మనుగడ యాపన్నకాల మరణము లెందున్ ౫౦.

క. కర్కశరిపు నెడఁ దొలఁగక । మార్గ్యోనఁదగు సంధిచేసి మతి కదిసిన చోఁ
దార్గ్యోను నతనికి మృత్యువు । కర్కటి గర్భంబుచేతఁ గ్రాఁగినభంగిన్ ౫౧

క ఏదోషంబులు నతనికి । నాదింజేయుటయు కల్గఁదని క్రూరాత్మం
గాదు గదియంగఁ బలుకఁ బ్రమాదము మతిమంతులైన మనుజులకెల్లన్ ౫౨.

వ అనియిట్లు హిరణ్యకుండు పలికిన లఘుపతనుం డిట్లనియె ౫౩

క నీనీతివాక్యపద్ధతు।లేనన్నియు వింటి నీకు నిష్ఠునిఁగా న
న్నీ నెఱిఁ గైకొనకుండిన । నేనశనము దొఱఁగి దేహ మిచ్చట విడుతున్ ౫౪.

వ. అని మఱియును. ౫౫.

చ కరఁగిన నెల్లలోహములు గ్రక్కునఁ గూడు నిమిత్త మాత్రమై
జరగుటఁజేసి పక్షిమృగ సంతతిగూడు భయంబు లోభమున్
బరఁగుటఁజేసి మూర్ఖు సులభంబుగఁ గూడు గుణాఢ్యులైన స
త్పురుషులుచూచినంతటనె పొందొనరింతురు సూ హిరణ్యకా ౫౬.

గీ. మంటికడవఁబోలె మఱి దుర్జనస్నేహ । మధిక శీఘ్రముననె హత్తు విరియుఁ
గనక కలశభాతి గల సజ్జనస్నేహ। మొదవుఁ బగులఁబడక పదిల మగును

వ. అనియిట్లు లఘుపతనుండు పలికిన హిరణ్యకుం డిట్లనియె ౫౭

క నే నీకు నెంత చెప్పినఁ । గానిమ్మన కెల్ల భంగిఁ గావలె ననుచుం
బూనితి నాయెడ మైత్రికి । నేనుం దగనియ్యకొంటి నెంతయు వేడ్కన్ ౫౮

మ ఉపకారం బొకవంకఁ జేయుటయుఁ దానూహింప సన్మైత్రియే
యపకారం బొకవంకఁ జేయుటయుఁ దానబ్భంగి శత్రుత్వమే

నెప మొక్కింతయులేని వర్తనము లున్మేషింప మేలీళ్ల న
చ్చపువాత్సల్యము ద్వేషముం గలుగుటల్ సౌహార్దశత్రుత్వముల్ ౬౦

వ అనుచు నివ్విధంబున నన్యోన్యసంభాషణంబుల నత్యంత స్నేహంబులు నిగుడ నఖమాంసంబులుం బోలి యచ్ఛేద్యంబులగు నంతఃకరణంబులం గలసికూడి మెలంగు నంత హిరణ్యకుండు తనగృహంబున స్వేచ్ఛావిహారం బొనంగిలఘుపతనువీడ్కొల్పిన నతండునుం దనమందిరంబునకుం జని యప్పటప్పటికి మహాగహనంబునకుం బోయి సింహశరభశార్దూలాదులచేతం జచ్చిన మృగంబుల మాంసంబులు దెచ్చి హిరణ్యకునకుఁ బెట్టి తాను నుపయోగించుచున్నఁ గొంతికాలంబునకు నొక్కనాఁడు హిరణ్యకుం జూచి లఘుపతనుం డిట్లనియె ౬౧.

ఉ ఉండితి నీకడన్ విడువనోపక యివ్విపినంబులోన నేఁ
డొండొకకాన కేగవలయున్ ననుఁబంపుము చక్రవాక కా
రండవరాజహంస బకరాజవిహార విరాజమానమై
యుండు సరోవరం బచటనుండును నాచెలికాఁడు నిచ్చలున్ ౬౨.

ఉ ఆతఁడు మిత్రమంథర సమాఖ్యమునం బొగడొందు కచ్ఛపం
బీతటి నేనుబోవఁ బ్రియమేర్పడ వేగమె తెచ్చిపెట్టు నా
నాతనువర్ణమీనముల నాదుశరీరము వృద్ధిఁబొందు బ్రే
మాతిశయంబు గానఁబడునట్లుగఁ బాయఁగరాని చుట్టమై ౬౩

వ అనినవిని హిరణ్యకుం డిట్లనియె ౬౪

గీ నిన్నుఁ బాసి నిలువనేర నీతోడన । వత్తుఁగొంచుపొమ్ము వాయసేంద్ర
ప్రాప్తమైన దుఃఖభరము దేశాంతర । గమనుఁడైనఁగాని క్రాఁగదెందు ౬౫

వ అనిపలుక లఘుపతనుండదరిపడి నాతోడనిన్నిదినంబు లెన్నఁడుం జెప్పవు దుఃఖప్రాప్తియగుటకుఁ గతం బేమియని యడిగిన హిరణ్యకుండు నాతెఱంగంతయు నచ్చటఁదేటపడ వివరింపం దెలియుదువుగాని నన్నుఁదోడ్కొనిపొమ్మనిన నతండట్లకాకయని చంచూపుటంబునం గబళించి గగనభాగంబున నమ్మూషికంబుఁ గొనిచనివాయసంబు దానుమున్నరుగ నుద్యోగించిన సరోవరతీరంబునఁ బెట్టి నిలిచినసమయంబున ౬౬

ఉ ఎన్నఁడురాని చుట్టమిదె యిచ్చటికిం జనుదెంచె భాగ్యసం
పన్నుఁడనై తినంచు జలమధ్యము వెల్వడి యర్ఘ్యసత్క్రియల్
గ్రన్ననొనరించి చెలికానిఁగనుంగొని కూర్మనాథుఁ డో
యన్నమహాత్మ మూషకము నారసి యెచ్చటనుండి తెచ్చితో ౬౭.

వ అనిన మిత్రమందరునకు లఘుపతనుం డిట్లనియె ౧౮

చ ఇతఁడు హిరణ్యకుండనఁగ నిమ్మహిమూషకభర్త నాకు సం
తతమును నెయ్యుఁడై తిరుగు దైవకృతంబునఁ దీవ్రదుర్దశన్
ధృతిచెడి నిల్వలేక చనుదెంచెను నీపొడగాన నీతనిన్
జతురభవద్వచోవిభవసంపద శోకము మాన్పు నాకుఁగాన్ ౧౯

గీ విను సహస్రముఖమ్ముల వేలుపొండెఁ। దెలిసి నాలుగుముఖముల దేవుఁడొండె
సురగురుండొండె నితనివిశుద్ధగుణము। లెన్న నోపుదు రన్నవారెన్న లేరు ౨౦

గీ చెలిమిగలకాల మెల్లను జెఱుపకునికి । క్రోధమాత్రమె పొద్ద శీఘ్రుంబెకూడివిడుట
యొగివిప్సంగుఁడునుబోలె నిచ్చిచనుట।యివిమహాత్ముల గుణములై యెన్నఁబడును

వ అనిమతియుఁ జిత్రగ్రీవోపాఖ్యానంబు మొదలుకొని హిరణ్యకుని గుణకథనంబు లమ్మహాత్మునికిం దేటపడంజెప్పి నాకంటె నీవితని నీకు నిష్టసఖునింగాఁ బరిగ్రహింపుమని యతని నప్పగించిన నాశ్చర్యచిత్తుండై మిత్రమందరుండు హిరణ్యకున కిట్లనియె ౨౨.

గీ అనఘ యింతదూరమునక నిర్జనమైన । వనముచొచ్చి నన్నుఁ గనుట కిచట
నేమి కార్యమనిన నెఱిఁగింతు వినుమని।యతఁడు చెప్పఁ దొడఁగె నతనితోడ ౨౩

సీ ఒకయూరిలోపల నొరపైన మఠమొప్పునందుఁ జూడాకర్ణుఁ డనఁగఁబరఁగు
సన్న్యాసి బ్రాహ్మణ సదనంబులకుఁ జని యెత్తిన భిక్షతో నేగుదెంచి
మఠములోనికిఁ దెచ్చి మానుగాభుజియించి శేషాన్న మొకపాత్రఁ జిందకుండ
నచ్చోట నిడి నిద్రనందిన నాతని ప్రియసఖుండగు బృహస్ఫిగుఁడు వచ్చి
నిద్ర దెలిపి యతని నెఱియ నే వినుచుండఁ । బుణ్యకథలచేతఁ బ్రొద్దుగడప
వినుచు నతఁడు నన్ను వెఱపించు కొఱకునై । గిలుకలున్న వెదురు కేలఁబట్టి ౨౪

గీ అప్పటప్పటి కాకోల చప్పుడించి । నన్నుఁ దనభిక్షపాత్రయు నాటఁజూడఁ
గథలు చెప్పెడునాతండు గనలు నిగుడ। నేమి చెప్పితి నిందాఁక నేమివింటి ౨౫.

వ. ఏకాగ్రచిత్తుండవుగామికిఁ గతంబేమియనినఁ జూడాకర్ణుండాబృహస్ఫిగునకిట్లనియె నాచిత్తంబు నీవుచెప్పెడు కథలమీఁద సావధానంబు గామి నిజంబు నీవు నక్కథయెట్లొక్కొయెఱింగితివవె యొక్కమూషికంబు నామఠంబునవసియించి నాభిక్షాపాత్రంబునంగలయన్నంబొక్కింతగన్నుమూసినసమయంబున నంతయుఁ దినిపోవ నేనును నమ్మూషికాపకారంబునకు నీమఠంబువిడిచి పోవంగలవాఁడనై యున్నవాఁడననిన బృహస్ఫిగుండిట్లనియె నీమఠంబున వసియించిన మూషికం

బొకటియొ బహుమూషకంబు లున్నవోయనినఁ బెక్కులేవొక్కటియేయనిన నతం
డొక మూషకంబీమరంబునవసియించుటకుఁ గారణంబుగలుగవలయు నెట్లంటేని.

గీ శాండలీమాత యనునట్టి చంద్రవదన । నువ్వుఁబప్పుకు సరి చేరునువ్వులడుగ
నెఱయ విప్రుండు కారణ మెఱిఁగినట్లు। మూషికంబున్న కారణమును నెఱుంగు

వ అనిన నత్తెఱంగెఱింగింపుమనినఁ జూడాకర్ణునకు బృహస్ఫిగుం డిట్లనియె ౭౮.

మ వినుమేనొక్కఁ థ రామరేంద్రుగృహ మన్వేషించి భిక్షింపఁగాఁ
జని యున్నంతట నింటి బ్రాహ్మణుఁడు విస్పష్టంబుగా నింతితో
వనజాతాయత నేత్ర రేపటియమావాస్య మ్మహాదేవభో
జనకార్యంబున కేమిగూర్చితివి వాత్సల్యంబునం జెప్పుమా ౭౯

వ. అనిన బ్రాహ్మణి దనపురుషునీక్షించి యిట్లనియె ౮౦

క తననేర్పుకొలఁదిఁ బురుషుం। డనువున ద్రవ్యములుగూర్చి యవి దెచ్చినచో
వనితలు పాకక్రియలకు । నొనరింతురు నీవుదేక యున్నవె చెపుమా ౮౧

వ అనిన నమ్మహీదేవుండమ్మగువం గోపించి యిట్లనియె ౮౨

క. తగుసంచయంబునలయుం। దగ దతిసంచయము సేయుతలఁ పెవ్వరికిన్
మృగధూర్తంబతికాంక్షను । మగువా మును వింటిచేత మడిసెను వినవే ౮౩

చ అనుటయుఁ గాంత తత్కథ ప్రియంబునఁ జెప్పుఁడనంగ బ్రాహ్మణుం
డనియెఁ గిరాతుఁడొక్కఁడు గృహంబుననుండి పలోపజీవియై
టను వనభూమికేగి యొకరావున నొక్కమృగంబుఁ జంపి చే
కొనిచను దెంచుచోఁ గనియెఁ గోలము నీలకుభృద్విశాలమున్ ౮౪

వ కనుంగొని యాత్మగతంబున ౮౫

క ఇదినాకు దైవమిచ్చిన। యది యని తనమూఁపు వేఁటు నటువెట్టి శిత
ప్రదరంబు దొడిగియేసిన। నది వాని వధించి తాను నవ్వలఁ దెళ్లెన్ ౮౬

క అంత నొకనక్క యామిషు। చింతంజరియించుచుండి చేరువఁగని య
త్యంతముదంబునఁ బొంగుచు। నెంతయు భాగ్యమున నబ్బెనిది నాకనుచున్

గీ దాటునూలవెట్టుఁదలఁకుదిక్కులుచూచు। తొకనులుచుఁగదియఁదొడఁగుఁదొలఁగు
మోదిచేరనరుగు మూర్కొనుఁదార్కొను। కాలుద్రవ్వునిసుముకలయఁజల్లుర ర

వ ఇవ్విధంబున ననేక ప్రకారంబుల నాదద్రుకనామధేయంబగు మృగధూర్తంబు
పెన్నిధానంబు గన్నపేదయుంబోలె నత్యంత సంతుష్టాంతరంగంబునఁ దనలో
నిట్లని వితర్కించె ౮౯.

గీ బోయనొకనాఁడుభక్షింతుభూరిమృగము। సూకరంబును రెన్నాళ్లక్షుధకువిడుతుఁ
బట్టి యూరక యివిగంటిపెట్టనేల। నేఁటి కీనారిదగు వేయునేటికనుచు ౯౦